Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

ఆదివారం, జూన్ 15, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## ఏఐజీ ఆసుపత్రికి కేసీఆర్.. రెండోరోజు ఆరోగ్య పరీక్షలు!



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యంతో ఉన్నట్టు తెలుస్తోంది. గత రెండు రోజులుగా కేసీఆర్.. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ క్రమంలో కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు కూడా ఆసుప్రతికి వచ్చారు. వివరాల ప్రకారం.. కేసీఆర్ శనివారం మరోసారి గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి వెళ్లారు. వైద్య పరీక్షల కోసం అక్కడికి చేరుకున్నారు. అయితే, నిన్న కొన్ని టెస్టుల తర్వాత ఈ రోజు మరోసారి ఆసుపత్రికి వెళ్లినట్టు తెలుస్తోంది. ఆరోగ్య పరీక్షల్లో భాగంగా కేసీఆర్ శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆసుపత్రికి వచ్చిన ఆయన.. గంట పాటు అక్కడే ఉన్నారు.



# వచ్చే ఎన్నికల్లో బిసి సిఎం ఖాయం

**ఇప్పటివరకు పార్టీలకు ఓటు బ్యాంకుగానే ఉన్న బిసిలు**

**కులగణనతో మా వాటా మాకు కావాలని నినాదం**

**కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగణంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తాం**

**ఓబిసి పోరుబాట పుస్తకావిష్కరణలో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**

హైదరాబాద్ : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బిసి ముఖ్యమంత్రి కావడం ఖాయమని పిసిసి అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలకు అతీతంగా బిసిలు ఏకం కావాల్సిన అవసరం ఎంతైన ఉందని అయన పిలుపునిచ్చారు. శనివారం నాంపల్లి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో మధ్యప్రదేశ్ ఐఏఎస్ అధికారి (ప్రిన్సిపల్ సెక్రెటరీ) పరికిపండ్ల నరహరి, అడ్వకేట్ పృధ్వీరాజ్‌సింగ్ పరమాల్ రచించిన "ఓబిసిల పోరుబాట" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిసిల్లో ఐకృత లోపించిందని, రాష్ట్రంలో కులగణన తర్వాత మెజారిటీగా ఉన్న బిసిలు ఒకతాటిపైకి వచ్చి పార్టీలకు అతీతంగా ఐక్యంగా పనిచేయాలని కోరారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంగా ఆయన అభివర్ణించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో పకడ్బందీగా నిర్వహించిన కులగణనతో దేశానికి తెలంగాణ దిక్సూచిగా మారిందన్నారు. ఇప్పటి వరకు రాజకీయపార్టీలు చాలా వరకు బిసిలను

(మిగతా 2వ పేజీలో)



## ప్రతిఘటిస్తున్నది మేము.. సాగిలపడింది మీరు

**నాడు జగన్ సర్కార్‌తో బిఆర్ఎస్ కుదుర్చుకున్న లోపాయికారి ఒప్పందాలే తెలంగాణకు శాపంగా మారాయి**

**బనకచర్లనుతిరస్కరించాలని జనవరిలోనే కేంద్రానికి లేఖ రాశాం**

**జూన్ 13న మరోసారి లేఖ రాశాం డిపిఆర్ ప్రతిపాదనలను అడ్డుకోవాలని, టెండర్లను రద్దు చేయాలని కోరాం**

**కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కుదించింది మీరు కాదా?**

**హరీశ్‌రావుకు నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ కౌంటర్**

హైదరాబాద్: బనకచర్ల–గోదావరి లింక్ ప్రాజెక్టును గట్టిగా ప్రతిఘటించిందే తమ ప్రభుత్వమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ప్రకటనపై మంత్రి ఉత్తమ్ తీవ్రంగా స్పం దించారు. బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కె సిఆర్, ఏపి ముఖ్య మంత్రి జగన్‌మోహ న్ రెడ్డి లోపాయికారిగా కుదుర్చుకున్న ఒప్పందాలు తెలంగాణకు శాపంగా మారాయని విమర్శించారు. ఏపి సిఎం నిధుల కోసం రాసిన లేఖపై తాను జనవరి 22 నే కేంద్రానికి రాసిన లేఖను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉదహరించారు. అధికారికంగా ఉన్న అభ్యంతరాలను లేవనెత్తుతూనే జూన్ 13 నాటి ప్రతిపాదనలను తిరస్కరించడంతో పాటు డిపిఆర్ ప్రతిపాదనలను నిలువరించి టెండర్లను రద్దు చేయాలని తాను డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయ పోరాటానికి సిద్దంగా ఉందన్నారు. ఏపి ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం దీనికి సంబంధించిన లేఖలను మీడియాకు విడుదల చేశారు. శుక్రవారం ఆయన రాసిన లేఖలో ఏపి ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్ట్(డిపిఆర్) ను అడ్డుకోవడంతో పాటు ప్రాజెక్టు టెండర్లను కూడా నిలిపివేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఏపి ప్రభుత్వం దూకుడుచర్యలు తెలంగాణకు శరఘాతంగా మారుతున్నాయని, గోదావరి జలాల ఒప్పందాన్ని ఉల్లంఘించడమే అవుతుందన్నారు. గోదావరి జల వివాద ట్రిబ్యునల్ ను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు

(మిగతా 2వ పేజీలో)



## ఉన్నత స్థాయి కమిటీ దర్యాప్తు

**పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**

**ఎయిర్ సేఫ్టీపై ఉన్నతాధికారులతో సమీక్ష**

న్యూఢిల్లీ: గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై హోం శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఉన్నత స్థాయి బృందం దర్యాప్తు చేస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. శనివారం ఎయిర్ సేఫ్టీపై ఉన్నతాధికారులతో సమీక్ష అనంతరం ఢిల్లీలోని ఉడాన్ భవన్‌లో మీడియాతో మంత్రి మాట్లాడారు. మీడియా సమావేశానికి ముందు అక్కడి వారంతా మృతులకు సంతాపసూచికగా ఒక నిమిషం మౌనం పాటించారు.

2లో



# హాలీవుడ్‌కు వేదికవ్వాలి

**అంతర్జాతీయ సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదికగా మారాలి: సీఎం రేవంత్**

**అందుకు సినీ పెద్దలు కృషిచేయాలి...**

**ప్రభుత్వం కొంత కఠినంగా కనిపించినా అది సినిమా అభివృద్ధి కోసమే..**


**తెలుగు సినీ పరిశ్రమకు ఏం కావాలో నాకు చెప్పండి..**

**ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది**

**నేను మరో 22 ఏళ్ల క్రియాశీల రాజకీయాల్లో ఉంటా..**

హైదరాబాద్: అంతర్జాతీయ సినీ పరిశ్రమ హాలీవుడ్‌కు హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ దిశగా సినీ పెద్దలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. భారతీయ సినిమా అంటే ఒకప్పుడు బాలీవుడ్ అని అందరూ భావించేవారు.. కానీ ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. భారతీయ సినిమాల్లో తెలుగు సినిమా ముందు వరుసలో ఉందని చెప్పారు. ఇకపై బాలీవుడ్‌కు హైదరాబాద్ వేదిక కానుందని పేర్కొన్నారు. శనివారం హైటెక్స్‌లో తెలంగాణ గద్దర్ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. 2014 నుంచి 2024 వరకు ఉత్తమ చలనచిత్రాలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ ప్రభుత్వం సినీ పరిశ్రమను గౌరవించి 1964లో

(మిగతా 2వ పేజీలో)



## నేటి నుంచి మోదీ విదేశీ పర్యటన

**కెనడాలో జీ7 సదస్సుకు హాజరు**

**సైప్రస్, క్రొయేషియాల్లోనూ పర్యటించనున్న ప్రధాని**

**ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి విదేశాలకు**

# బనకచర్లపై కళ్లు తెరవండి

**నష్టం జరగకముందే అడ్డుకోండి**

**వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలి.. బనకచర్లను అడ్డుకోవాలి..**

**నెలాఖరు లోగా టెండర్లు పిలవడానికి ఎపి సిద్ధం అవుతుంటే రేవంత్ నిద్రపోతున్నారు**

**రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? లేక చంద్రబాబు ప్రభుత్వమా?**

**నదులు, నిధులు ఎపికి.. తెలంగాణకు గుండుసున్నా ఇదే కేంద్రం తీరు**

**పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు**



హైదరాబాద్: కృష్ణా జలాలను అక్రమంగా తరలించడానికి పోతిరెడ్డిపాడు ఎలా మారిందో గోదావరి జలాలను తరలించుకుపోవడానికి బనకచర్ల అలాంటిదేనని మాజీ మం త్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఎపి సర్కారు ముందుకెళ్తుంటే తెలంగాణ సిఎం, ఇరిగేషన్ శాఖ మం త్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గో దావరి –బనకచర్ల లింక్ ప్రాజెక్టులపై తెలంగాణ భవన్‌లో శనివారం హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇ చ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్ర భుత్వంపై ఆయన పలు విమర్శలు

(మిగతా 2వ పేజీలో)

# కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం

- కూర్మలో ఆధ్యాత్మిక కేంద్రానికి నిప్పు, భారీ ఆస్తి నష్టం
- దుండగుల పనేనని నిర్వాహకుల ఆరోపణ, దర్యాప్తు ముమ్మరం
- ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి
- లోతైన విచారణ జరపాలని పోలీసులకు ఆదేశం
- కూర్మ గ్రామ పునరుద్ధరణకు పూర్తి సహాయంపై భరోసా



వాయిస్ టుడే
ఆదివారం,
జూన్ 15, 2025

# నేటి నుంచి మోదీ విదేశీ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సు జరిగే కెనడాతో పాటు సైప్రస్, క్రొయేషియాల్లో ఆయన పర్యటించనున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు, జూన్ 16, 17 తేదీల్లో కెనడాలోని కననాస్కిస్‌లో జరిగే జీ7 సమావేశంలో మోదీ పాల్గొంటారు. ఇంధన భద్రత, సాంకేతికత, ఆవిష్కరణలతో సహా కీలక ప్రపంచ సమస్యలపై భారత్ వైఖరిని ప్రపంచ దేశాలతో ఆయన పంచుకోనున్నట్టు మంత్రిత్వ శాఖ తెలిపింది. అందేగాక పలువురు జీ7, ఇతర దేశాధినేతలతో ప్రధాని భేటీ కానున్నారు. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ తరువాత ఆయనకు ఇదే తొలి విదేశీ పర్యటన. ఖలిస్తానీ సమస్య కారణంగా కెనడాతో దౌత్య సంబంధాలు క్షీణించాక ఆ దేశంలో పర్యటిస్తుండటమూ ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో దౌత్య బంధాలు మెరుగవుతాయని విదేశాంగ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. ఇందుకు ప్రభుత్వం మార్గాలను అన్వేషిస్తోందని విదేశాంగ శాఖ ప్రతినిధి ఇటీవలే చెప్పారు. 2023లో కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య జరగడం తెలిసిందే. అందులో భారత ఏజెంట్ల ప్రమేయముందని నాటి ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. అంతేగాక అప్పటి భారత హై కమిషనర్ సంజయ్ వర్మతో సహా అనేక మంది మన దౌత్యవేత్తలకు నిజ్జర్ హత్యతో సంబంధముందని కూడా కెనడా ఆరోపించింది. వీటిపై భారత్ మండిపడింది. ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఈ ఉదంతంతో కెనడాతో సంబంధాలు దెబ్బతిన్నాయి. తర్వాత ట్రూడో తప్పుకోవడం, ఇటీవలి ఎన్నికల్లో మార్క్ కార్నీ ప్రధాని కావడంతో కొన్ని నెలలుగా, అధికారుల స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. కొత్త హైకమిషనర్లను నియమించే అవకాశాలను రెండు దేశాలూ పరిశీలిస్తున్నాయి. భారత్ జీ7 సభ్య దేశం కాకపోయినా ఆహ్వానిత దేశంగా 12వసారి పాల్గొంటోంది. ఈ సదస్సుకు మోదీ హాజరవుతుండటం ఇది వరుసగా ఆరోసారి. 1975లో ఫ్రాన్స్ ప్రారంభించిన జీ7కు ఇది 50వ సంవత్సరం. ఫ్రాన్స్‌తో పాటు ప్రధాన ఆర్థిక వ్యవస్థలైన కెనడా, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్, అమెరికా ఇందులో సభ్య దేశాలు. యూరోపియన్ యూనియన్ కూడా జీ7కు పూర్తిస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తోంది. అంతర్జాతీయ శాంతిభద్రతలు, ఆర్థిక స్థిరత్వం, వాతావరణ మార్పులు, దేశాల నడుమ సహకారం, అంతర్జాతీయ నేరాల కట్టడికి ఉమ్మడి చర్యలు, మౌలిక వసతులు, పెట్టుబడులు, యువత, ఉపాధి అవకాశాలు తదితరాలపై జీ7 దృష్టి సారిస్తుంది. భారత్ వంటి దేశాలను 'ప్రచార భాగస్వామి'గా జీ7 ఏటా ఆహ్వానిస్తోంది.

# ఉన్నత స్థాయి కమిటీ దర్యాప్తు

"ఉన్నత స్థాయి బృందంలో హోంశాఖ కార్యదర్శి, పౌర విమానయాన శాఖ కార్యదర్శి, అహ్మదాబాద్ పోలీసు కమిషనర్, ఐబీ స్పెషల్ డైరెక్టర్ నియమించాం. అవసరమైతే మరి కొందరిని కమిటీలోకి తీసుకుంటాం. మూడు నెలల్లో ఈ కమిటీ నివేదిక అందిస్తుందని భావిస్తున్నాం"అని మంత్రి తెలిపారు. విమాన ప్రమాదం జరిగిన తీరును వివరించారు. ఊహించని రీతిలో జరిగిన ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే గుజరాత్ ప్రభుత్వం, పౌరవిమానయాన శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాయన్నారు. "బోయింగ్787%-%8 డ్రీమ్‌లైనర్ విమానంలోని బ్లాక్‌బాక్స్ శుక్రవారం సాయంత్రం దొరికింది. దానిని డీకోడ్ చేసి అందులోని సమాచారాన్ని సమగ్రస్థాయిలో విశ్లేషించిన తర్వాతే మీడియాకు అదనపు సమాచారం అందజేస్తాం. బోయింగ్ 787 సిరీస్ విమానాల భద్రతపై దర్యాప్తునకు ఆదేశించాం. ప్రస్తుతం బోయింగ్787 సిరీస్‌లో 33 విమానాలు ఉన్నాయి. వీటిలో ఏడు విమానాల భద్రతపై అధికారులతో సమీక్ష నిర్వహించా. ఈ సిరీస్ విమానాలను తరచూ తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించాం. ఉన్నత స్థాయి బృందం సోమవారం భేటీ అవుతుంది"అని మంత్రి పేర్కొన్నారు. ఆ బాధ నాకూ తెలుసు.. ఈ విమాన ప్రమాదం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని రామ్మోహన్ అన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. 'రోడ్డు ప్రమాదంలో నా తండ్రిని కోల్పోయా.. ఆ బాధ ఎలా ఉంటుందో నాకు తెలుసు'అని అన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి డీఎన్ఏ పరీక్షలు జరుగుతున్నాయని, మృతదేహాలను వీలైనంత తొందరగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తామని కేంద్రమంత్రి తెలిపారు.



# వచ్చే ఎన్నికల్లో బిసి సిఎం ఖాయం

ఓటు బ్యాంకుగానే చూశారు, కులగణన తర్వాత మా వాటా మాకు కావాలి అనే స్థాయికి బిసిలు ఎదిగారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారి సమక్షంలో రాష్ట్రంలో జరిగిన కులాల సర్వేపై దేశ వ్యాప్తంగా ఉన్న 450 పైగా కాంగ్రెస్ ప్రతినిధులకు తాను పవర్ పాయింట్ ప్రజంటేషన్(పిపిపి) ఇచ్చి సమగ్రంగా వెల్లడించినట్లు చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్ అనుగుణంగా బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం చట్ట బద్దత కల్పిస్తుందని, పార్టీ నేత రాహుల్ గాంధీ ఆశయం మేరకు కుల సర్వేను శాస్త్రీయ బద్దంగా నిర్వహించారని తెలిపారు. అడుక్కుంటే వచ్చేది కాయో, పండు కానీ పోరాడితే మాత్రం వచ్చేది మాత్రం హక్కులు, అధికారం అని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ తెలిపారు. అణిచివేతకు గురైన వారు మాత్రమే సంఘాలు ఏర్పాటు చేసుకుని తమ హక్కులు కోరుతారు, అలాంటి వారే పుస్తకాలు రాస్తారు, ఉద్యమాలు చేస్తారని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ రాజ్యం, రాజ్యాంగం ఎవరి చేతిలో ఉందనే దానిమీద ఆధారపడే రేపటి ఫలితాలు ఉంటాయని చెప్పిన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇంజనీరింగ్, ఐఏఎస్, డాక్టర్ ఏది కావాలన్నా మెరిట్ ఉండాలి కానీ, రాజకీయ నాయకులకు కూడా మెరిట్ ఉండాలనేది తన అభిప్రాయమన్నారు.

# హాలీవుడ్‌కు వేదికవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

నంది అవార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఆ అనవాయితీ ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగింది. కొన్ని కారణాలవల్ల ఈ అవార్డుల పంపిణీ వాయిదా పడుతూ వచ్చింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటయ్యాక సినీ అవార్డుల ప్రదానంపై నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత ఇవాళ గద్దర్ పేరుతో అవార్డులు అందిస్తున్నాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. 'భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమ. తెలుగు సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదికైంది. రాష్ట్ర ప్రభుత్వం కొంత కఠినంగా కనిపించినా అది మీ అభివృద్ధి కోసమే. తెలుగు సినీ పరిశ్రమకు ఏం కావాలో నాకు చెప్పండి. రాష్ట్ర ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మరో 22 ఏళ్లు నేను క్రియాశీల రాజకీయాల్లో ఉంటా. నేను ఏ హోదాలో ఉన్నా సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తా. ఐటీ పరిశ్రమలాగే సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తాం. 2047 విజన్ డాక్యుమెంట్‌లో సినీ పరిశ్రమ అభివృద్ధికి ఒక అధ్యాయం కేటాయిస్తాం. నేను ఇటీవల నీతి అయోగ్ సమావేశంలో ప్రధాని మోదీకి తెలంగాణ విజన్ గురించి వెల్లడించాను. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తాం. ఇప్పటివరకు నేను అనుకున్నవన్నీ సాధించాను. ఇది కూడా సాధ్యమవుతుందని 100 శాతం నమ్మకం ఉంది. తెలుగు సినీ పరిశ్రమలో ఇప్పుడు నాలుగో తరం కొనసాగుతోంది. గద్దరన్న అంటే ఒక విప్లవం.. ఒక వేగుచుక్క. ఆయనే మాకు ఒక స్ఫూర్తిం. ఆ స్ఫూర్తితోనే మేం పోరాటాలు చేశాం. తెలంగాణ అభివృద్ధికి మీ అందరి సహకారం ఉండాలని



కోరుతున్నా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. గద్దర్ ఆలోచనలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు గద్దర్ ఫౌండేషన్‌కు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. ఫౌండేషన్‌కు అవసరమైన నిధులు కేటాయిస్తామని గతంలో గద్దర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఉద్యమం, సాంస్కృతిక రంగంపై తనదైన ముద్ర వేసిన గద్దర్ సేవలకు గుర్తింపుగా ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుతోంది. ఇక ముందు గద్దర్ జయంతి వేడుకల కార్యక్రమాల నిర్వహణలోనూ గద్దర్ ఫౌండేషన్‌కు భాగస్వామ్యం కల్పిస్తూ మరో ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేసింది.

# బనకచర్లపై కళ్లు తెరవండి

గు ప్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బ నకచర్ల ప్రాజెక్టు నిర్మాణ పనులను చు రుగ్గా చేపడుతుంటే, మన ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని హరీష్ రావు విమర్శించారు. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ మా లేక చంద్రబాబు డైరెక్షన్‌లో నడుస్తున్న ప్రభుత్వమా? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఈ నెలాఖరు నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా నిద్రలోనే ఉందని ఆరోపించారు. నీటి పారుదల శాఖ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉత్తుత్తి మాటలు మాట్లాడుతు న్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం పెట్టడా నికి ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కెటిఆర్, ప్రతిపక్ష నేతలపై ఎలా కేసులు పెట్టాలనే దానిపైనే ధ్యాస తప్ప రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలనే ఆలోచన లేదని హరీష్ రావు విమర్శించారు. ప్రతిపక్షాల మీద ఇరిటేషన్ తప్ప, ఇరిగేషన్ మీద దృష్టి లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలు పదవుల కోసం తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. గోదావరి బనకచర్లకు టెండర్లు పిలుస్తుంటే సిఎం రేవంత్‌రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. కృష్ణా నీళ్ళు తాత్కాలిక ఒప్పందానికి మించి ఎపి తీసుకుపోతుంటే ఎందుకు మాట్లాడరు..గోదావరి నదిలో తెలంగాణకు ద్రోహం తలపెడితే ఎందుకు స్పందించరు..? అని అడిగారు. గత రెండు కేంద్ర బడ్జెట్లు చూస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద తెలంగాణకు గుండు సున్నా అని వివరించారు. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే తెలంగాణకు సున్నా.. ఇదీ ఢిల్లీ పాలకుల వైఖరి అని ధ్వజమెత్తారు. నిధుల్లో, నదుల్లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగినప్పటికీ ఈ రాష్ట్రంలో ఉన్న 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బిజెపి ఎంపీలు నోరు విప్పడం లేదని మండిపడ్డారు. తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రుల నుంచి ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. గోదావరి –బనకచర్లకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిధులు ఇచ్చి సహకరిస్తోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు కేంద్రానికి ఎవరు ఇచ్చారని అడిగారు. 2 టిఎంసిల బాబ్లీ నీటి కోసం చంద్రబాబు నాయుడు 2008లో పెద్ద పోరాటం చేశారని, 200 టిఎంసిలతో అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంత పోరాటం చేయాలని అన్నారు. మీ దోస్తానా కోసం తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు పెడతారా..? అంటూ సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. తెలంగాణ కంటే పది రెట్ల నిధులు



ఆంధ్రకి ఇచ్చినమని స్వయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆంధ్రాలో చెప్పారని గుర్తు చేశారు. కేంద్రంలో పరపతితో చంద్రబాబు పై నుండి కాకుండా పోలవరం నుండి నీళ్ళు మళ్ళించి, కేంద్రం నుండి నదుల అనుసంధానం పేరుతో నిధులు తెచ్చుకున్నారని తెలిపారు. అయినా రేవంత్ రెడ్డికి, మంత్రులకు కదలిక లేదని విమర్శించారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఇప్పటికైనా కళ్లు తెరవాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి %-% బనకచర్లను అడ్డుకోవాలని కోరారు. బిఆర్ఎస్‌కు రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే ముఖ్యం అని, బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా తాము మద్దతిస్తామని వెల్లడించారు. ఈ విషయంలో అసెంబ్లీలో తీర్మానం చేద్దామంటే సహకరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రాకపోతే బిఆర్ఎస్ పార్టీ ప్రజా పోరాటానికి, న్యాయపోరాటానికి శ్రీకారం చుడుతుందని వెల్లడించారు.రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టవద్దని కోరారు. రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు బంద్ చేయాలని అన్నారు. రేవంత్‌రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలిపోకు అంటూ హితవు పలికారు. బిజెపి, కాంగ్రెస్ ఎంపీలు మౌనం వీడి, చంద్రబాబు జల దోపిడిని అడ్డుకోవాలని కోరారు.

# కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం

శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండల పరిధిలోని కూర్మ గ్రామంలో ప్రశాంతతకు భంగం వాటిల్లింది. ఆధ్యాత్మిక చింతనతో, ప్రకృతి ఒడిలో జీవనం సాగించే ఈ గ్రామంలోని ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం కొన్నిరోజుల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందా లేక ఎవరైనా దుండగులు ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి దుశ్చర్యలు జరిగాయని మందిర నిర్వాహకుల్లో ఒకరైన ప్రభుదాస్ పోలీసులకు వివరించారు. ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం అని పేర్కొన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి, నిజానిజాలు నిగ్గు తేల్చాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. "ఆధునిక హంగులు లేకుండా అధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరం. శ్రీకాకుళం జిల్లా హిరమండలం సమీపంలోని కూర్మ గ్రామంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేశాను. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలి. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాము. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైంది. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్ళల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారులు సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలి" అని పవన్ స్పష్టం చేశారు.



# ప్రతిఘటిస్తున్నది మేము.. సాగిలపడింది మీరు



ఏపి పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణాకు దక్కాల్సిన గోదావరి నదిజలాల వాటా హక్కును ప్రత్యక్షంగా దిక్కరించడమే అవుతుందని మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ఏపి ప్రభుత్వం డిటైల్ ప్రాజెక్టు రిపోర్ట్(డిపిఆర్) సమర్పించడం అంటే కేంద్ర జల వనరుల సంఘం ఆమోదించి నట్లు అవుతుందా అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖలో సూటిగా ప్రశ్నించారు. ఏపి వెనుకబాటు తనాన్ని అడ్డు పెట్టుకుని బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కేంద్రంపై నిధుల కోసం వత్తిడి చేస్తూ కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపి ముఖ్యమంత్రి లేఖ రాసిన ఉదంతాన్ని మంత్రి ఉత్తమ్ ప్రస్తావించారు. ఇరురాష్ట్రాల గోదావరి నదీజలాల వాటాల ఖరారు కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఏపి ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులను ఎలా ప్రతిపాదిస్తుందని మంత్రి ఉత్తమ్ ప్రశ్నించారు. బనకచర్ల–గోదావరి లింక్ ప్రాజెక్టును గట్టిగా ప్రతిఘటించిందే తమ ప్రభుత్వమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం మాజీ మంత్రి హరీష్ రావు ప్రకటనపై మంత్రి ఉత్తమ్ తీవ్రంగా స్పందించారు. బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కెసిఆర్, ఏపి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిలు లోపాయకారికంగా కుదుర్చుకున్న ఒప్పందాలు తెలంగాణకు శాపంగా మారాయని విమర్శించారు. ఏపి సిఎం నిధుల కోసం రాసిన లేఖపై తాను జనవరి 22 న కేంద్రానికి రాసిన లేఖను మంత్రి ఉత్తమ్ ఉదహరించారు. అధికారికంగా ఉన్న అభ్యంతరాలను లేవనెత్తుతూనే జూన్ 13 నాటి పి.ఎఫ్.ఆర్ లను తిరస్కరించడంతో పాటు డి.పి.ఆర్ ప్రతిపాదనలను నిలువరించి టెండర్ల ను రద్దు చేయాలని తాను డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయ పోరాటానికి సిద్దంగా ఉందన్నారు.

### బిఆర్ఎస్ ఉదాసీనతే కారణం

తెలంగాణా నీటి హక్కుల అంశంలో ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఉదాసీనతే కారణమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వంలో చేసుకున్న నీటి కేటాయింపులతోనే తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లిందన్నారు. వాస్తవానికి కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటా 724 టిఎంసిలు ఉండగా 290 టిఎంసిలకు కుదించి ఏపి ప్రభుత్వానికి 512టిఎంసిల నీటిని అప్పగించిన ఘనత బి.ఆర్.ఎస్ పాలకులది అని ఆయన విమర్శించారు. వారు తీసుకున్న నిర్ణయంతోనే ఈనాడు రాష్ట్రంలో నీటి సంక్షోభానికి కారణంగా మారిందన్నారు. మచ్చుమర్రి, మాల్యల ప్రాజెక్టులకు అక్రమంగా నీటిని తరలిస్తున్న సమయంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం టెండర్ల ప్రక్రియ సాగుతుంటే బిఆర్ఎస్ ప్రభుత్వం ఎపెక్స్ కౌన్సిల్ ను ఎందుకు ఆశ్రయించ లేదని మంత్రి ఉత్తమ్ ప్రశ్నించారు.

# బిజెపి సిద్ధాంతాలకు ఆదర్శాలకు పూనరంకితమై నీతి నిజాయితీ నిబద్ధత క్రమశిక్షణ చిత్తశుద్ధితో పని చేయాలి

## - బిజెపి ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మార్నేణీ పణీంద్ర



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- భారతీయ జనతా పార్టీ ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మారినేని ఫణీంద్ర ఆధ్వర్యంలో ఉప్పల్ డివిజన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉప్పల్ ప్రబారి మేడ్చల్ జిల్లా నాయకులు గోపు రమణారెడ్డి,సీనియర్ నాయకులు ధర్మారెడ్డి,బలవంత చారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఈ యొక్క సమావేశంలో పలు కార్యక్రమాలపై నిర్ణయం తీసుకొని డివిజన్ పూర్తిస్థాయి కమిటీ కూడా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగాపూర్తిస్థాయి కమిటీ వేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు ఫణీంద్ర మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలకు ఆదర్శాలకు పూనరంకితమై నీతి నిజాయితీ నిబద్ధత క్రమశిక్షణ చిత్తశుద్ధితో వ్యవహరిస్తారని తగిన సమయం ఇచ్చి పదవ డివిజన్ నాయకులు కార్యకర్తలు అందరిని యువకులను సమన్వయం చేస్తూ కులాలకు మతాలకు అతీతంగా డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఉద్యమాలు చెప్పడం ద్వారా పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచి అన్నీ వర్గాల్లో మరింత విస్తరించడానికి మీ వంతు కృషి చేయాలని కొత్తగా ఏర్పడ్డ కమిటీకి సూచించారు. అనంతరం ఉప్పల్ రామాలయంలో నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించి కమిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని వారు పంజాల శ్రవణ్ కుమార్ గౌడ్ జూలూరి శ్రీధర్ గుప్తా, గురువయ్య, సతీష్ గౌడ్,నూతన కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శులుగా తీగ,విఠల్ రావు ముదిరాజ్,నామ శ్రవణ్,ఉపాధ్యక్షులుగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,భవిష్ ప్రసాద్,గాజుల నాగరాజు గౌడ్, నామ అనిత,కోశాధికారిగా దువ్వాళ రమేష్, కార్యదర్శులుగా బసవరాజు, శ్రీనివాస్ ముదిరాజ్,పరశురాం, స్వామి గౌడ్ నియమితులయ్యారు.



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

### బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్ జూన్ 14(వాయిస్ టుడే): నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ కాకతీయ నగర్ లో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గండిమైసమ్మ – బాచుపల్లి ప్రధాన రహదారిలో డాక్టర్ రెడ్డీస్ వద్ద సిగ్నల్ ఏర్పాటుచేయాలని, అదే విధంగా కాలనీలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్డు పనులు, పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు.అనంతరం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోజు రోజుకు వెలుస్తున్న కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పరుస్తున్నామని, రానున్న రోజుల్లో కాకతీయ నగర్ కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తానని అన్నారు.ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, మేనేజర్ పవన్, డీఈ వసంత, మేనేజర్ జై రాజ్, శానిటేషన్ ఇంచార్జ్ సుకృత రెడ్డి, విద్యుత్ ఏఈ శశిదర్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పైడి మాధవి, బాలాజీ నాయక్, పెద్దిరెడ్డి సుజాత, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, నాయకులు సాంబ శివ రెడ్డి, స్వామి, వైయస్ , ప్రవీణ్, అనిల్, సతీష్ రెడ్డి, ప్రదీప్, బొబ్బ శ్రీనూ, బిక్షపతి, మేకల మధుసూదన్, దుసకంటి వెంకటేష్, విద్య సాగర్, జలగం చంద్రయ్య, యువ నాయకులు ఆనంద్ రెడ్డి, కాకతీయ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షుకు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి వినోద్, కోశాధికారి దశరథ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతో సామాజిక న్యాయం...

**మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ కమిటీలలో అన్ని వర్గాలకు పెద్దపీట..**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ సమాజమంతా రుణపడి ఉంటుంది..**

**బీసీలలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ సమాజానికి మంత్రి పదవి ఇవ్వడం ఇందుకు నిదర్శనం..**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి ధన్యవాదాలు తెలిపిన నీలం మధు ముదిరాజ్..**



కుత్బుల్లాపూర్ జూన్ 14(వాయిస్ టుడే): సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి రుజువైందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ కాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంత్రివర్గ విస్తరణతో పాటు టీపీసీసీ కమిటీల్లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ జుబ్లీహిల్స్ లోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నిలబెడుతు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ విస్తరణతో పాటు టీపీసీసీ కమిటీలో అందరికీ సమ ప్రాధాన్యత కల్పించారని కొనియాడారు. రెండో విడతలో ఇచ్చిన మూడు మంత్రి పదవులు ఒకటి బీసీలలో అత్యదికులైన ముదిరాజ్ సామాజిక వర్గంతో పాటు రెండు దళితులకు కేటాయించడాన్ని ఆయన స్వాగతించారు. బహుజనులతో పాటు యావత్ తెలంగాణ సమాజమంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటామని తెలిపారు. యావత్ తెలంగాణ ప్రజల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితోపాటు సమన్యాయాన్ని విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## కుత్బుల్లాపూర్ 131 డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఎంపీ ఈటెల రాజేందర్‌కు పరిచయం చేసిన కట్టా కుమార్



కుత్బుల్లాపూర్ జూన్ 14(వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ కుత్బుల్లాపూర్ 131 డివిజన్ కట్టా కుమార్ అధ్యక్షతన నూతనంగా నియమించిన కార్యవర్గ సభ్యులను ఈరోజు మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసి కార్యవర్గ సభ్యులను పరిచయం చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి శ్రీధర్ వర్మ మరియు డివిజన్ నాయకులు మహిళా నాయకురాలు కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఒక బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని అందుకు వారి సహకారం ఉంటుంది

### :- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా శనివారంరోజు రాజభవన్ లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమక్షంలో రక్తదాన దినోత్సవం వేడుకలు బ్రహ్మాండంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకత ను గురించి తెలియచేస్తూ రెడ్క్రాస్ నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంక్స్ గురించి, అలాగే తలసేమియా వ్యాధిగ్రస్తులకు వారు అందిస్తున్న సేవల గురించి కొనియాడారు. రాష్ట్రం లో ప్రతి జిల్లాలో ఒక బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని అందుకు వారి సహకారం ఉంటుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసే వారిని ప్రోత్సహిస్తున్న అలాగే శిభిరాలను ఏర్పాటు చేస్తున్న సద్ది వెంకటరెడ్డి ప్రతి సంవత్సరం వారి కుటుంబ సభ్యులతో పాటు వివేరా హొటల్ మేనేజర్, స్టాఫ్, కార్మికులతో క్రమం తప్పక రక్తదానం చేస్తున్న వివేర హొటల్ అధినేత సద్ది వెంకటరెడ్డి ని జ్ఞాపికతో సత్కరించారు, ఈ కార్యక్రమం లో రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ దానం కిషోర్,ప్రధాన కార్యదర్శి శ్రీరాములు,భవాని శంకర్, శ్రీ.ఓ.ఎస్. రెడ్డి, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి యాదాద్రి రెడ్ క్రాస్ చైర్మన్ లక్ష్మీ నరసింహ రెడ్డి, ఎం సి మెంబర్ మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ డి. బాలాజీ అన్ని జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రక్త దానం చేయండి... ప్రాణదాతలుగా మారండి

### ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్

శేరిలింగంపల్లి,జూన్ 14 (వాయిస్ టుడే): ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేసి ప్రాణదాతలుగా మారాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో ఆదర్శ్ నగర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ. ఆపదలో ఉన్నవారికి రక్త దానం చేస్తే వారి ప్రాణాలు కాపాడిన వారమవుతామన్నారు.కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం స్వచ్ఛంద రక్తదానం పట్ల ప్రజలలో ఉన్న అపోహలను తొలగించి, రక్తదానం చేసేందుకు వారిని చైతన్య పరచడమేనన్నారు. ఈ సందర్భంగా 20 మంది రక్తదాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్ధన్, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, జీవి రావు, ప్రేమ్ సింగ్, బసవరాజు, కుర్రా మహేష్, బీ సుధాకర్, బోయిన మహేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రామారావు, బాలరాజు పాల్గొన్నారు.





## నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### అమీన్పూర్ లో ఘనంగా వనమోత్సవం

అమీన్పూర్ : భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని చక్రపురి కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వన మహోత్సవం - మొక్కలు నాటుదాం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై.. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలతో పాటు పార్కులు, గేటెడ్ కమ్యూనిటీలు, దేవాలయాలు, పరిశ్రమల ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### శివాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్


అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని చక్రపూరి కాలనీలో రిటైర్డ్ ఉద్యోగులు తమ సొంత నిధులతో నిర్మిస్తున్న శివాలయాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ పరిశీలించారు. రాబోయే రోజుల్లో ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## ఫార్మాస్యూటికల్ పరిశోధనలో డాక్టర్ రాధిక ముత్తడికి పీహెచ్డీ



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని రాధిక ముత్తడిని డాక్టరేట్ వరించింది. సూపర్ సాచురబుల్ సెల్ఫ్-నానో ఎమల్సిఫైయింగ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ (sSNEDDS) ఉపయోగించి బీసీఎస్ క్లాస్-II ఔషధాల ద్రావణీయత, జీవ లభ్యతను పెంచడంపై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. పిత్త వాహిక క్యాన్సర్ (చోలాంగియోకార్సినోమా) కోసం పెమిగాటినిబ్, ఎంట్రెక్టినిబ్ లక్షిత చికిత్సల కోసం అధునాతన ఔషధ పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయడంపై డాక్టర్ రాధిక అధ్యయనం దృష్టి సారించిందన్నారు. నోటి జీవ లభ్యతను మెరుగుపరచడానికి నానోటెక్నాలజీ ఆధారిత sSNEDDSని ఉపయోగించి, స్థిరమైన, ప్రభావవంతమైన డెలివరీ వ్యవస్థలను రూపొందించడానికి, వర్గీకరించడానికి దశ-రేఖాచిత్ర విశ్లేషణ, గణాంక ఆప్టిమైజేషన్ ను ఆమె ఉపయోగించినట్టు తెలియజేశారు.

అవక్షేపణ నిరోధకంగా HPMC-K4M యొక్క ఆశాజనక ఉపయోగాన్ని పరిశోధన ఎత్తి చూపడమే గాక, క్యాన్సర్ చికిత్సలో భవిష్యత్తులో వివో అధ్యయనాలకు విలువైన ఫార్మకోకైనటిక్ అంతర్దృష్టులను అందిస్తుందన్నారు. డాక్టర్ రాధిక సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ రాధిక విజయం, గీతం యొక్క విద్యా నైపుణ్యం, ప్రభావవంతమైన పరిశోధన పట్ల అచంచలమైన నిబద్ధతను నిదర్శనమన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన గాలి అనిల్ కుమార్

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన గాలి అనిల్ కుమార్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి గాలి అనిల్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు.

## బాబు జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ప్రకటించాలి

### తెలంగాణ షెడ్యుల్డు క్యాస్ట్స్ అధ్యక్షుడు సురేందర్....



శేరిలింగంపల్లి,జూన్ 14(వాయిస్ టుడే): భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ సేవ అపారమైనవనీ కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారతరత్న ప్రకటించాలని తెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేందర్ కోరారు.పద్మశ్రీ అవార్డు గ్రహీత, దళిత బాంధవుడు ,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఇటీవల బాబు జగ్జీవన్ రామ్ కు భారతరత్న ఇవ్వాల్సిందేనని అనటం సరైనధేనని అన్నారు.ఐదు దశాబ్దాలుగా పార్లమెంటేరియన్ గా వివిధ మంత్రి పదవులను విజయవంతం గా దేశానికి ఎన్నో సేవలు అందించారు. అన్ని వర్గాల ప్రజలకు తన అపారమైన అనుభవంతో అభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడినారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బాబు జగ్జీవన్ రామ్ సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించాలని సురేందర్ డిమాండ్ చేశారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
ఆదివారం, 15 జూన్ 2025



## గచ్చిబౌలిలో పలు పబ్‌లపై అర్ధరాత్రి పోలీసుల దాడులు

### తనిఖీల్లో నలుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ

శేరిలింగంపల్లి, జూన్ 14(వాయిస్ టుడే): వీకెండ్ నేపథ్యంలో గచ్చిబౌలి లోని పలు పబ్ లపై అర్ధరాత్రి మాదాపూర్ ఎస్ఓటి పోలీసుల దాడులు నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఎస్ఎల్ఎన్ టర్మినల్ మాల్ లో ఉన్న పబ్ తోపాటు క్లబ్ రఫ్, ఫ్రాట్ హౌస్ పబ్ లలో కూడా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నలుగురికి డ్రగ్స్ పాజిటివ్ తోపాటు డీజే ప్లేయర్ శివకు డ్రగ్ పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ చేశారు. డగ్స్ నిర్ధారణ అయిన వారికి ఎన్ డి పి ఎస్ యాక్ట్స్ తోపాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు



## ప్రతి శనివారం భక్తులకు లడ్డు ప్రసాదము

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట : శ్రీ స్వామి వారి దర్శనము కొరకు విచ్చేయు భక్తులకు ప్రతిరోజు భక్తులకు ప్రసాద వితరణ చేయుటకు గాను ఈ రోజు శ్రీయుత కార్యనిర్వహణాధికారి వెంకట్రావు IAS ప్రత్యేక పూజలు నిర్వహించి ఇట్టి కార్యక్రమం ప్రారంభించడం అయినది. వారములో ఆరు రోజులు పులిహోర ప్రసాదము, ప్రతి శనివారము రోజున లడ్డూ ప్రసాద వితరణ గావించబడును. ఈరోజు శనివారం సందర్భంగా లడ్డు ప్రసాదం భక్తులకు వితరణ గావింపబడినది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి S వెంకట్రావు IAS అనువంశిక ధర్మకర్త మరియు ఆలయ అర్చకులు , అధికారులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి ఏసీబీ నోటీసులు ఇవ్వడం సమంజసం కాదు

### :- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు కి ఏసీబీ మరోసారి నోటీసులు ఇవ్వడాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పత్రికా ప్రతినిధులకు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు.

ఏసీబీ అధికారులు గతంలో ఒకసారి కేటీఆర్ ని సుదీర్ఘంగా విచారించి ఏమీ తేల్చలేకపోయిన సందర్భాన్ని ఆయన గుర్తు చేశారు. ఫార్ములా-ఈ రేస్ సజావుగా సాగిందని,ఇందులో ఎలాంటి అక్రమాలు జరుగకున్నా, ఎటువంటి అవినీతి చోటుచేసుకోకున్నా కేటీఆర్ నివిచారించడం చట్ట వ్యతిరేకమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక హామీలను అమలుచేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇటువంటి కుయుక్తులు పన్నుతున్నదని వ్యాఖ్యానించారు.హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేస్ నిర్వహించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నగరానికి ప్రత్యేక పేరు ఖ్యాతి లభించి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావడానికి దోహదపడిందని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించే వారిపై అధికార పక్షం అక్రమ కేసులు బనాయిస్తూ,కక్షపూరిత రాజకీయాలకు పాల్పడడాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని ఆయన చెప్పారు. ఇటువంటి కుట్రలు, కుయుక్తులకు బీఆర్ఎస్ నాయకులు,శ్రేణులు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడబోరని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రెండో రోజూ ఏఐజీ హాస్పిటల్ లో వైద్య పరీక్షలు



శేరిలింగంపల్లి,జూన్ 14(వాయిస్ టుడే): తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ కు శుక్రవారం మరియు శనివారం గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) హాస్పిటల్ లో వైద్య పరీక్షలు చేశారు. జనరల్ చెకప్ లో భాగంగా ఆయన వరుసగా రెండో రోజు ఆసుపత్రికి వెళ్లారు.కేసీఆర్ శుక్రవారం కూడా ఆరోగ్య పరీక్షల కోసం ఏఐజీ ఆసుపత్రికి వెళ్ళిన విషయం విధితమే.శుక్రవారం ఆసుపత్రికి వచ్చిన కేసీఆర్,దాదాపు గంటసేపు అక్కడే ఉన్నారు.ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రి ఛైర్మన్, గ్యాస్ట్రో ఎంటరాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసీఆర్‌కు ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు లేవని వైద్యులు తెలిపారు.

# విమాన ప్రమాదం ఎయిర్ ఇండియా తప్పిదమే

### ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి....

### మృతులకు ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు కొవ్వొత్తులతో నివాళులు.....




సికింద్రాబాద్, జూన్ 14 ( వాయిస్ టుడే ప్రతినిధి): అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాదంలో విలువైన ప్రాణాలను కోల్పోవడం ఎయిర్ ఇండియా తప్పిదమే అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు విజయ్ మల్లంగి అన్నారు. ఈ ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కొన్ని సాంకేతిక సమస్యల దృష్ట్యా, చైనా ఇప్పటికే బోయింగ్‌కు వీడ్కోలు చెప్పిందన్నారు. ట్యాంక్ బండ్, అంబెడ్కర్ విగ్రహం వద్ద శనివారం రాత్రి ఎయిర్ ఇండియా విమాన ప్రమాద మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి వారికీ ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆప్ నేతలు విజయ్, బుర్ర రాము గౌడ్, డాక్టర్ అన్సారి, సలాం, సోలొమన్ రాజు మాట్లాడుతూ ఎయిర్ ఇండియా ప్రయాణికుల తోపాటు యువ వైద్య విద్యార్థులతో సహా అనేక మంది ప్రాణాలు కోల్పోవడం హృదయాలను బద్దలు కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి ఎవరు జవాబుదారీ? డి.జి.సి.ఏ నా? ఎయిర్ ఇండియా నా ? భారత ప్రభుత్వ మా అని వారు ప్రశ్నించారు. మన దేశంలో జీవనం విలువ రోజురోజుకూ దిగజారిపోతోందని, మోదీ ప్రభుత్వానికి పరిశ్రమల ప్రైవేటీకరణ పైనున్న ఆసక్తి ప్రజలను పర్యవేక్షించడం సురక్షితంగా ఉంచడం పై లేదని విమర్శించారు. విమాన ప్రమాదానికి బాధ్యత వహించి కేంద్ర విమానాయన శాఖ మంత్రి ఎర్రం రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వేగవంతంగా విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించి మరొక ప్రమాదం జరగకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమం లో ఆప్ నేతలు లక్ష్మ నాయుడు, టి. రాకేష్ సింగ్, రాకేష్ రెడ్డి, రహమాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ పై చిక్కడపల్లి పీఎస్‌లో ఫిర్యాదు

సికింద్రాబాద్, జూన్ 14 (వాయిస్ టుడే ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది భానుచందర్ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లో టీపీసీసీ లీగల్ సెల్, కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం కేటీఆర్ పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బి ఆర్ కే భవన్ వద్ద కేటీఆర్ సీఎంను కించపరుస్తూ ఆయన పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయన ప్రసంగ వీడియోలను పోలీసులకు చూపించారు. అనంతరం భానుచందర్ మాట్లాడుతూ కేటీఆర్ తన స్థాయిని మరిచి సీఎంను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కేటీఆర్ పై 356, 352, 353, 296 సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని పోలీసులను కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అభిషేక్ కెనడి, మారిశెట్టి నర్సింగ్ రావు, గుండు జగదీష్ బాబు, నరేందర్ యాదవ్, గుర్రం దినేష్, మజర్, హఫీజ్, దినేష్, ముష్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసియా కప్ పోటీలకు ఎంపికైన ప్రవళిక

### అభినందించిన మంత్రి పొన్నం...



సికింద్రాబాద్, జూన్ 14 (వాయిస్ టుడే ప్రతినిధి): సాఫ్ట్ బాల్ క్రీడాకారిని చేపుర్వ ప్రవళిక ఆసియా కప్ పోటీలకు ఎంపికైంది. చైనాలో నిర్వహించే పోటీలకు తెలంగాణ నుంచి భారత్ పక్షాన ఆమె పోటీల్లో పాల్గొంటుంది.. ఈ సందర్భంగా శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఆయన నివాసంలో ప్రవళిక కలిశారు. ఈ సందర్భంగా పొన్న ప్రభాకర్ ఆమెను సత్కరించి శుభాకాంక్షలు తెలిపి, తెలంగాణకు పేరు తీసుకురావాలని కోరారు. గతంలో రాష్ట్రం నుండి 25 పైగా జాతీయ అంతర్జాతీయ వేదికలపై సాఫ్ట్ బౌల్ పోటీల్లో పాల్గొన్న ప్రవళిక వరుసగా మూడోసారి అంతర్జాతీయ స్థాయిలో ఎంపికైంది.

## గొల్లకురుమలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి: సైదులు యాదవ్



సికింద్రాబాద్ జూన్ 14 (వాయిస్ టుడే ప్రతినిది): రాష్ట్ర మంత్రివర్గంలో గొల్ల కురుమలకు స్థానం కల్పించాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మనబోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. గొల్ల కురుమలకు జరుగుతున్న అన్యాయాలపై ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సైదులు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 28 లక్షల జనాభా కలిగిన గొల్లకురుమలకు మంత్రి పదవి కేటాయించకపోవడం సరికాదన్నారు. జనాభా దామాషా ప్రకారం రాష్ట్ర మంత్రివర్గంలో గొల్ల కురుమలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. దాంతోపాటు రెండు ఎమ్మెల్సీ పదవులు, కాంగ్రెస్ పార్టీ అంతర్గత పదవులలో ప్రాముఖ్యం కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న గొల్లకురుమ విద్యార్థి నాయకులకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ ప్రాతినిధ్యం ఉన్న చోట గొల్లకురుమలకు డీసీసీ పదవులలో చోటు కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఎస్.ఎన్.టి. రిజర్వేషన్‌లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ లో గొల్లకురుమలు గొర్రెల విక్రయాల ద్వారా ప్రభుత్వానికి రూ. 10,000 కోట్లు సమకూరుతున్నాయని, వాటిని తిరిగి గొల్లకురుమల అభివృద్ధికి కేటాయించాలని అభిప్రాయపడ్డారు. గొల్లకురుమల అభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ కమిటీ ఏర్పాటుచేసి రూ.10,000 కోట్లు నిధులు కేటాయించాలన్నారు. యాదగిరి గుట్ట ఆలయ ఛైర్మన్ తో పాటు డైరెక్టర్‌లలో 50% గొల్లకురుమలకి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూము నవీన్, నూకల మధు, వికాస్, సురేష్, కార్తీక్, అభిలాష్, రమేష్, శ్రీధర్, అనిల్, శంకర్, నవీన్, వినోద్, శ్రీనివాస్, సురేష్, శివ, మోహన్, సంతోష్, శ్రీకాంత్, శేఖర్, శోభన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బిర్ల ఐలయ్య గృహంలో పనిమనిషి ఆత్మహత్య

వాయిస్ టుడే/ యాదగిరిగుట్ట : కొంత కాలంగా వెంటాడుతున్న ఆర్థిక సమస్యలతో మానసికంగా కుంగిపోయి.. క్రమంగా మద్యానికి బానిసై.. డిప్రెషన్ కు లోనై తన భర్త గంధమల్ల రవి ఉరేసుకొని బలవన్మరణం చెందాడని మృతుడి భార్య గం ధమల్ల నవిత, కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, ఈ విషయంలో తమకు ఎలాంటి అనుమానం కూడా లేదని వారు స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక యాదగిరిగుట్ట పోలీసు స్టేషన్ లో భార్య నవిత కుటుంబ సభ్యులతో కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ విప్, %మీరూ% బీర్ల అయిలయ్య గృహంలో ( యాదగిరిగుట్ట ) వంట పనులు చూసుకునే గంధమల్ల రవి ఆత్మహత్యకు చేసుకున్న విషయం తెలిసిందే. ఫిర్యాదులో ఆమె పేర్కొన్న అంశాలు ఈ విధంగా ఉన్నాయి. సైదాపురం గ్రామానికి చెందిన గంధమల్ల రవికి తనకు (నవిత) 2007లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. మా దాంపత్యానికి ప్రతీకగా ఇద్దరు కుమార్తెలు జన్మించారు. కుటుంబ జీవనం కోసం రవి పలు రకాల ( దినసరి కూలీ ) పనులు చేస్తుండేవాడు. కానీ ఆర్థికంగా ఎదగలేకపోయాము. పైగా అప్పులయ్యాయి. వాటిని తీర్చే క్రమంలో సొంత ఇంటిని తనఖా (మాడిగేజ్) పెట్టి గత మూడు సంవత్సరాల క్రితం రూ. 6 లక్షల నగదును ప్రైవేట్ బ్యాంక్ లో లోన్ తీసుకున్నాము. ఆ లోన్ కు సంబంధించి కనీసం (%జువీ×%) వడ్డీ కట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రవి గత పక్షం రోజులుగా ( 15 రోజులుగా ) తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నాడు. ధైర్యం చెప్పే ప్రయత్నం చేసినా మార్పు కనిపించలేదు. క్రమంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈ తరుణంలోనే తీవ్ర స్థాయిలో డిప్రెషన్ లోనై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన మేము



అక్కడి వారికీ సమాచారం అందించి, మా సమక్షంలోనే హుటాహుటినా ఆసుపత్రికి తరలించాము.

### ఉపాధి కల్పించిన దేవుడు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య.

స్వంత గ్రామస్తులుగా భావించి మానవీయ కోణంలో తమకు ఉపాధి (తన నివాసంలో ఇంటి పనులు చూసుకునేందుకు) కల్పించిన దేవుడు MLA బీర్ల అయిలయ్య అని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. వ్యక్తిగత, కుటుంబ కారణాలకు రాజకీయాలకు ముడి పెట్టడం సరికాదన్నారు. ఇబ్బందికర పరిస్థితుల్లో తమకు అండగా నిలిచిన దేవుడు బీర్ల అయిలయ్య అని చెప్పుకొచ్చారు.

### బాధిత కుటుంబానికి అయిలయ్య పరామర్శ

గంధమల్ల రవి మృతి వార్త తెలుసుకొని విప్ బీర్ల అయిలయ్య దిగ్భ్రాంతికి గురయ్యారు. భౌతికకాయాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రిలో సందర్శించి, విచారం వ్యక్తం చేశారు. ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. మృతికి గల కారణాల పై ఆరా తీశారు. దుఃఖసాగరంలో మునిగిన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

### మానవత్వం మరిచి నీచ రాజకీయాలు..

వ్యక్తిగత ( ఆర్థిక సమస్యలు ) కారణాలతో మృతి చెందిన గంధమల్ల రవి అంశానికి రాజకీయ రంగులు అద్ది, ప్రతిపక్ష పార్టీలు మానవీయతకు సమాధి కట్టడం విచారకరం. మృతుడి సొంత కుటుంబ సభ్యులు అప్పుల బాధతో బలవన్మరణం చెందాడని చెబుతున్నా.. వాటిని పట్టించుకోకుండా ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తూ.. శవాల పైన పేలాలు ఏరుకునే నీచ సంస్కృతికి తెర తీయడం అత్యంత విషాదకరం. అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ ఇప్పటికే కాంగ్రెస్ నేతలు పోలీసు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారి పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

### అంత్యక్రియల్లో పాల్గొన్న బీర్ల అయిలయ్య..

సైదాపూర్ గ్రామంలో గంధమల్ల రవి అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు వారి సతీమణి బీర్ల అనిత గారు పాల్గొన్నారు... ఉదయం పోస్టుమార్టం నుండి.. సాయంత్రం చితి కాలే వరకు రవి కుటుంబ సభ్యులకు అండగా ఉన్నారు.




# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

### ఓంకార్ భవన్‌లో జరిగిన సభలో వివిధ పార్టీ ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

### ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 14: మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపుమేరకు శనివారం వరంగల్ అండర్ బిడ్జి ఓంకార్ భవన్ లో ఆ పార్టీల జిల్లా నాయకులు సభ నిర్వహించారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్ సిపిఎం జిల్లా నాయకులు వలదాసు దుర్గయ్య సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి యాదగిరి న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు నున్న అప్పారావు సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు మోడెం మల్లేశం ,పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చందర్ తెలంగాణ ప్రజా ఫ్రంట్ హనుమకొండ వరంగల్ జిల్లా అధ్యక్షులు జనగాం కుమార స్వామి భారత్ బచావో జిల్లా నాయకులు ప్రవీణ్ రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు జన్ను కుమారస్వామి తదితరులు మాట్లాడారు.

వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ,అమిత్ షా ప్రభుత్వం మధ్య భారతంలో మావోయిస్టుల అణచివేత పేరున వందల మంది మావోయిస్టులు ఆదివాసులను చంపి వేస్తున్నది. రాజ్యాంగ ప్రకారం నడవాల్సిన బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా పనిచేస్తుందని వారు విమర్శించారు . ప్రజాస్వామ్యం పట్ల మోడీకి గౌరవం లేదని బడా కార్పొరేట్ శక్తులు అయిన అంబానీ ఆదానిలకు అనుకూలంగా పరిపాలన సాగిస్తుందని వారు ధ్వజమెత్తారు. మావోయిస్టులు శాంతి చేర్చలకు సిద్ధమని ప్రకటించినా మోడీ ప్రభుత్వం యొక్క హత్యాకాండ ఆగలేదని వారన్నారు. ఆదివాసీలు మావోయిస్టులు ఈ దేశ పౌరులు కాదా అని ప్రశ్నించారు?గతంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన ఉద్యమ సంస్థలతో చర్చలు జరిపిన సందర్భాలు ఉన్నాయని ఇప్పుడు మాత్రం మోడీ ప్రభుత్వం చర్చలకు తావు లేకుండా నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నదని వారు అన్నారు. మావోయిస్టుల ఆదివాసుల హననాన్ని ఆపివేసి వారితో చర్చలు జరపాలని వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని ఆపరేషన్ కగార్ ను ఆపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

**ర్యాలీని అడ్డుకున్న పోలీసులు**

అనంతరం ఆయా పార్టీ ప్రజాసంఘాల నాయకులు ఓంకార్ భవన్ నుండి వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ జంక్షన్ వరకుర్యాలీ తీయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కొంతసేపు పోలీసులకు నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. అయినప్పటికీ ర్యాలీ జరగనివ్వమని పోలీసులుతేల్చి చెప్పారు రోడ్డు పైకి వచ్చిన నాయకులు అక్కడే మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ నగర కార్యదర్శి బాశుమియా, ఎం సి పి ఐ యు నగర కార్యదర్శి సుంచు జగదీష్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎలకంటి రాజేందర్ భారత్ బచావో నాయకులు వెంగల్ రెడ్డి ఓం బ్రహ్మం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అరుణోదయ నాయకులు నలిగంటి పాల్ భైరబోయిన ఐలయ్య సుమన్‌లతోపాటు ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిప్యూటీ స్పీకర్‌ను సత్కరించిన గిరిజన నాయకులు



తొర్రూరు, జూన్ 14 వాయిస్ టుడే: డిప్యూటీ స్పీకర్ గా నియమితులైన డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచందర్ నాయక్ ను గిరిజన నాయకులు సత్కరించారు. శనివారం సూర్యాపేటలోని ఆయన నివాసంలో తొర్రూరు మండల వెలికట్ట శివారు టీక్యా తండాకు చెందిన జాటోత్ బ్రదర్స్,గిరిజన నాయకులు జాటోత్ స్వామి నాయక్, జాటోత్ సాయి కృష్ణ లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొర్రూరు డివిజన్ పరిధిలోని పెద్దవంగర మండలం బొమ్మకల్ శివారు రెడ్డి కుంట తండా గ్రామ పరిధిలోని (సర్పంచ్ తండా) కు చెందిన డాక్టర్ రామచందర్ నాయక్ వైద్యునిగా ప్రజలకు సేవలు అందించి తదనంతరం రాజకీయ ప్రవేశం చేసి ప్రజాసేవ చేస్తున్నాడని వారు కొనియాడారు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తూ ప్రజాభిమానం చూరగొంటున్న రామచందర్ నాయక్ కు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కడం హర్షనీయమని తెలిపారు. ఈ పదవి గిరిజనుల గౌరవాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. త్వరలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు.

## వెలికట్టలో అమ్మ మాట అంగన్వాడి బాట ర్యాలీ



తొర్రూరు, జూన్ 14 వాయిస్ టుడే : మండలంలోని వెలికట్ట గ్రామ పంచాయతీలో అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు.శనివారం ర్యాలీ తీసి అంగన్వాడీ ముద్దు ప్రవైట్ స్కూల్ వద్దు అని నినాదాలతో గ్రామాల్లోని వీధుల్లో తిరుగు తల్లిదండ్రులకు అవగాహనా కల్పించారు.3 సంవత్సరాలు నుండి 6 సంవత్సరాల పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేసుకోవాలని, అంగన్వాడీ సెంటర్ పిల్లలు మానసిక శారీరకంగా అభివృద్ధి జరగటానికి అట పాటలతో విద్య బోధిస్తారన్నారు.గ్రామంలో గర్భిణీలు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని తల్లి తండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి.రాజ్యలక్ష్మి, కె.శ్రీలత, ఎం.రాజ్యలక్ష్మి, ఎ.శైలజ, ఆయాలు ఎ.పద్మ, ఆర్.సరిత,డి పద్మ, పి.రజిత తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ, వాయిస్ టుడే: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను శనివారం తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ భాస్కర్ హైదరాబాద్ లోని కవిత నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజాసమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన ఉంటూ ప్రభుత్వంపై పోరాటం చేయాలని, ఎప్పటికప్పుడు ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఉండాలని కవిత పేర్కొన్నారు.కవిత ను కలిసిన వారిలో విజయ్ భాస్కర్ వెంట డివిజన్ అధ్యక్షులు చిన్ని ఉన్నారు.

## దేశాయిపేట నెహ్రూ మెమోరియల్ స్కూల్‌ను విద్య శాఖ అధికారులు పట్టించు కోవాలి

### బిజెపి నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు



వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 14 : వరంగల్ తూర్పు లోని దేశాయిపేట ప్రాంతంలో ఉన్నటువంటి నెహ్రూ మెమోరియల్ స్కూల్ గత 50 సంవత్సరాల చరిత్ర గల పాఠశాలనీ ఎందరో విద్యార్థులను ఉత్తమ భారత పౌరులుగా తీర్చిదిద్దిన పాఠశాల నేడు కనుమరుగయ్యే స్థితికి చేరుకోవడం చాలా బాధాకరమని బిజెపి నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. శనివారం దేశాయిపేటలోని నెహ్రూ మెమోరియల్ స్కూల్ ను సందర్శించిన అనంతరం ప్రదీప్ రావు మాట్లాడుతూ పాఠశాలలోని ఉపాధ్యాయులు డెప్యూటేషన్ పై రావడం మరియు విద్యాశాఖ పూర్తిగా ఈ పాఠశాలను పట్టించుకోకపోవడం వలన పాఠశాలలోని ఆవరణ, భవనాలు శిథిలవస్థితిలో ఉండటం వల్ల దేశాయిపేట మరియు చుట్టుపక్కల ఉన్న పేద, మధ్యతరగతి తల్లితండ్రులు ఇబ్బంది పడడం జరుగుతున్నదనీ అన్నారు. చరిత్ర కలిగిన ఈ ఒక్క పాఠశాలను పునః ప్రారంభం చేస్తే ఎంతోమంది పేద పిల్లలకు మెరుగైన విద్య అందించడం జరుగుతుందనీ కానీ స్థానిక మంత్రి ఎటువంటి సోయి లేకుండా వ్యవహరించి రాష్ట్రంలోనే వరంగల్ తూర్పు నియోజకవర్గ పరువును తీస్తూ, అధికార బలంతో విర్రవీగుతున్నారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలింగ్ నెంబర్ తాబేటీ వెంకట్ గౌడ్, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్ బిజెపి నాయకులు ఎర్రగుళ్ల శ్రీనివాస్, కొంతం సంగీత్, బల్లకారి రాజు, జూలూరి నైనీష్ గౌడ్, మంద్రాతి వెంకటేశ్వర్లు, కర్నే రవీందర్, తోట సురేష్,జన్ను సుబ్రహ్మణ్యం, వంగ సంపత్, మల్లికార్జున్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు..

### కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ రాజ్యం పునరుజ్జీవించింది

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి..

కాజీపేట, వాయిస్ టుడే: అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేస్తాం... దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరినీ పరిశీలించి నిజమైన అర్హులైన వారికి ఇళ్లు అందేలా అధికార యంత్రాంగాన్ని ప్రత్యేకంగా నియమిస్తున్నాం అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. శనివారం 47వ డివిజన్ బాపూజీనగర్, బోడగుట్ట ప్రాంతాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేసి అధికారికంగా నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని.. పక్కా ఇంటితో ఓ పేదవాడి జీవితం మారుతుందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. చిరకాలంగా ఆశతో ఎదురుచూస్తున్న వసతి కల కలలు కనే రోజు ఇది అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదల కలల రాజధాని 'ఇందిరమ్మ రాజ్యం' పునరుజ్జీవించిందని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. నిర్మాణాలలో నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా పర్యవేక్షణ కొనసాగుతుందని, అర్హులకే మొదట ప్రాధాన్యం ఇస్తామన్న విషయాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయ శ్రీ



రాజాలీ, మాజీ కార్పొరేటర్ రాంబాబు, డివిజన్ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రజకుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

### రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు ముప్పు బిక్షపతి...

### రజక సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా ఇంద్రాల రాజు..



సికింద్రాబాద్, జూన్ 14 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కరించాలని రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు ముప్పు బిక్షపతి కోరారు. శనివారం ట్యాంక్ బండ్ వద్ద తన కార్యాలయంలో రజక సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడిగా ఇంద్రాల రాజు ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రజక సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నందున ప్రభుత్వం రజకుల పై ప్రత్యేక దృష్టి సారించి సంక్షేమ పథకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## ఓయూ సివిల్ సర్వీస్ అకాడమీలో వివిధ పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు నోటిఫికేషన్ విడుదల

సికింద్రాబాద్, జూన్ 14 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ సివిల్ సర్వీసెస్ అకాడమీలో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025 - 26 విద్యా సంవత్సరంలో ఓయూలో చదువుతున్న విద్యార్థులకు యూపీఎస్సీ సివిల్స్ (ప్రిలిమ్స్), గ్రూప్ 1, గ్రూప్ 2తో పాటు ఇతర పోటీ పరీక్షలకు జనరల్ స్టడీస్ లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు వివరించారు. దీనికి సంబంధించిన దరఖాస్తును ఉస్మానియా యూనివర్సిటీ వెబ్సైట్లో పొందుపరిచామని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత పత్రాలను జత చేసి ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల రెగ్యులర్ తరగతులకు ఇబ్బంది కలగకుండా మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు అన్ని పనివేళల్లో అకాడమీలో సంప్రదించవచ్చున్నారు.



## ఆపరేషన్ సింధూర్ లో భారత సైన్యం విజయానికి సూచికగా ఉచితంగా 10 వేల పండ్ల మొక్కల పంపిణీ

### జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి, జూన్ 14(వాయిస్ టుడే) కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కెపిహెచ్బి కాలనీ 3వ ఫేస్ రమ్య గ్రౌండ్స్ లో వాసుదేవుడు ఆహ్వానం మేరకు మన కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, జస్టిస్ భవానీ ప్రసాద్, మిరియాల రాఘవ రావు, వాకాడ తిరుమలరావు, బసవాల శ్రీనివాస్, అంధే శ్రీరామ్ మూర్తి, యర్రా ఆనందరావు, దాసరి రంగారావు, మోటెపల్లి భరత్, హెచ్చ్ మూర్తి, వుచా రాంబాబు ముఖ్య అతిధులుగా హాజరై మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఉచితంగా 10 వేల పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం మరియు రక్తదాన కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిని ఇచ్చే కార్యక్రమాలని, ఇంకా మరేన్నో సేవా కార్యక్రమాలు చేయాలని వాసుదేవుడు మరియు మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్" వారికి అభినందనలు మరియు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వీరమహిళలు మరియూ మెగా అభిమానులు తధితరులు పాల్గొన్నారు.



## అధిష్ఠానం వర్గం కాంగ్రెస్ పార్టీ కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించి న్యాయం చేస్తుంది

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

కూకట్‌పల్లి, జూన్ 14(వాయిస్ టుడే) సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆస్తులమ్మి రాజకీయాలు చేస్తున్నామని పదవుల కోసం ఎప్పుడూ పాకులాడలేదని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తలు పార్టీ హక్కున చేర్చుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో పదవులు రాలేదని ఎవరు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గానికి సంబంధించి బ్లాక్ అద్యక్షులు డివిజన్ అధ్యక్షుల నియామకాల కోసం దరఖాస్తులను శనివారం మూసాపేట్ లోని పార్టీ కార్యాలయంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో సేకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ దుర్గం భాస్కరరావు, కూకట్ పల్లి నియోజకవర్గ పరిశీలకురాలు పారిజాత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆశావాహుల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పార్టీ నాయకులు ప్రజాక్షేత్రంలో ఉండాలని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు జరుగు తాయని నాయకులు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. అధిష్టానం దరఖాస్తుల పరిశీలన అనంతరం డివిజన్ బ్లాక్ అధ్యక్షులను ప్రకటించడం జరుగుతుందన్నారు.



## స్థానిక ఎన్నికలకు కార్యకర్తల సిద్ధం కావాలి

### – బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య

వాయిస్ టుడే ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట/ రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని శనివారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 16 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పది పైసల పనిచేసి రూపాయి ప్రచారం కల్పించుకుందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసిన ప్రచారం చేయడంలో వెనకబడి ఉన్నామని అన్నారు. ఇప్పటికైనా నాయకులు కార్యకర్తలు ప్రజల దగ్గర సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఆరు గ్యారంటీలు ,సన్న బియ్యం, రుణమాఫీ, 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ, మహిళలకు బస్సు ఫ్రీ, ఆరోగ్యశ్రీ ఐదు లక్షల నుండి పది లక్షలకు పెంపు, రైతు భరోసా ఎక్కడ ప్రభుత్వం తగ్గకుండా ప్రజల కోసం పనిచేస్తుందన్నారు.గత మూడు నెలల నుండి ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడిందని దానిని ఇంకా పెంచాలన్నారు. రేషన్ కార్డులను ఇప్పటికే ప్రభుత్వం జారీ చేస్తుందని రాజీవ్ వికాసం కూడా యువకుల కోసం అందించడం జరుగుతుందన్నారు. అటు సర్పంచులు ,ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, ఎంపీపీలు అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే కైవసం చేసుకునే విధంగా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. సీనియర్లకు అవకాశం కల్పిస్తామన్నారు. కానీ ఎన్నికలలో గెలుపే ధ్యేయంగా అభ్యర్థులను నిలబెట్టడం జరుగుతుందన్నారు.



## భూ నిర్వాసితులకు పరిహారం పంపిణీ

### 10 మందికి నష్టపరిహారం

### చెక్కులు అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వాయిస్ టుడే ప్రతినిధి, వేములవాడ/రాజన్న సిరిసిల్ల జిల్లా: వేములవాడ పట్టణంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు శనివారం చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న సందర్భంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా సమీకృత కార్యాలయల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో రాధాబాయి చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడలోని 10 మందికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోశాలలో సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు

### 40 పోస్టులకు 200 మందిని
### ఇంటర్వ్యూ చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### త్వరలో నియామక పత్రాల అందజేత

వాయిస్ టుడే ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల జిల్లా: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన గోశాలలో సిబ్బంది నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. రాజన్న ఆలయానికి సంబంధించిన వేములవాడ సమీపంలోని తిప్పాపూర్ గోశాలలో సిబ్బంది నియమాకానికి ఇటీవల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ పోస్టులకు దాదాపు 250 మంది దరఖాస్తు చేసుకోగా, శనివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంటర్వ్యూలు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ అధికారులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్హత, పని అనుభవం తదితర వివరాలను అభ్యర్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. 40 మందిని ఎంపిక చేసి త్వరలో వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. నూతన సిబ్బంది నియామకంతో గోశాలలో కోడెల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత తదితర సమస్యలు పరిష్కారం కానున్నాయని వివరించారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

### జిల్లా కోర్టు ప్రాంగణంలో విశేష స్పందన

వాయిస్ టుడే ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల జిల్లా: జిల్లా కోర్టు ప్రాంగణంలో జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) చైర్మన్ P. నీరజ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ, “రాజీ మార్గమే రాజా మార్గం” అని అన్నారు. కోర్టుల్లో నానాటికీ పెరుగుతున్న పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజలు పరస్పర సహకారంతో వివాదాలను రాజీ ద్వారా పరిష్కరించుకుని, శాంతియుత జీవితం గడపాలని ఆకాంక్షించారు. జీవిత కాలం చిన్నదైనది కాబట్టి గొడవలకు తావివ్వకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ విజయవంతం కావడంలో పోలీసుల, న్యాయవాదుల, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల, మీడియా సహకారాన్ని ఆమె ప్రశంసించారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు బి. పుష్పలత – మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, డి. చంద్రయ్య – అదనపు ఎస్.పి, రాధిక జైస్వాల్ – డీఎల్ఎస్ఏ కార్యదర్శి, పి. లక్ష్మణాచారి – సీనియర్ సివిల్ జడ్జి, మేజిస్ట్రేట్లు: శ్రీ ఎ. ప్రవీణ్, శ్రీమతి కె. సృజన, మిస్ జి. మేఘన, జె. శ్రీనివాస్ రావు – సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లోక్ అదాలత్ సభ్యులు: శ్రీ సిహెచ్. భాస్కర్, ఎ. వేణు, పి. శ్రీనివాస్ –పబ్లిక్ ప్రాసిక్యూటర్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.




# పూడికతీత.. కాంగ్రెస్ నేతల కమీషన్ల మేత: దాస్యం

**చెరువు మట్టిని అమ్ముకోవడం సిగ్గుచేటు**

**కాసుల కక్కుర్తితోనే పనులు ఆలస్యం**

**పనులు పూర్తి చేసే వరకూ బిల్లులు చెల్లించొద్దు**

**800 మంది మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారు**

**భద్రకాళి చెరువు పనులను పరిశీలించిన వినయ్ భాస్కర్**



హనుమకొండ, వాయిస్ టుడే: భద్రకాళి చెరువులో పూడికతీత పేరుతో కాంగ్రెస్ నాయకులు కోట్ల రూపాయల అవినీతికి తెరలేపారని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. శనివారం స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆయన భద్రకాళి చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరులతో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత పారదర్శకత కరువైందన్నారు. టెండర్లలో గోల్ మాల్ జరిగిందని, పనుల్లో పరేషాన్ నెలకొందని వాపోయారు. పూడికతీత పేరుతో కోట్ల రూపాయల అవినీతికి కాంగ్రెస్ నాయకులు తెరలేపారని, చెరువు మట్టిని అమ్ముకోవడం సిగ్గుచేటని విమర్శించారు. నవంబర్ లో భద్రకాళి చెరువు నీటిని వదిలినా మార్చి వరకు టెండర్లు ఎందుకు పిలవలేదని ఆయన ప్రశ్నించారు. వచ్చిన టెండర్లలో అర్హత లేని వారితో కుడా, ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కై కమిషన్ల ప్రాతిపదికన పనులు కేటాయించారని ఆరోపించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్ తదితర కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కమీషన్ల కోసమే పనులను ఆలస్యం చేశారని మండిపడ్డారు. కాంట్రాక్టుల పనుల్లో వారి వారి వాటా ఎంత అని వినయ్ భాస్కర్ ప్రశ్నించారు. అర్హత లేని కాంట్రాక్టర్ కు కుడా అధికారులు పనులను కమీషన్ పద్ధతిలో అప్పగించారని ఆరోపించారు. ఇప్పటి వరకు పూడికతీత పనులు నత్తనడకన సాగాయని.. కేవలం 30 శాతం పనులే జరిగాయన్నారు. పనులు పూర్తి చేసే వరకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించొద్దని ఆయన డిమాండ్ చేశారు. గచ్చిబౌలి భూములు చదును చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి జేసీబీలు, టిప్పర్లు దొరికాయి కానీ, నీటిని ఖాళీ చేసిన భద్రకాళి చెరువు పూడికతీతకు కాంట్రాక్టర్ కు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధి కి, అధికారులకు జేసీబీలు దొరకలేదా అని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టర్ అసమర్థత, స్థానిక ఎమ్మెల్యే, అధికారుల కాసుల కక్కుర్తి, కమీషన్ల వల్లే పూడికతీత పనులు ఆలస్యం అయ్యాయన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఎంత వరకు పనులు అయ్యాయో అంచనా ఎలా వేస్తారని, పూర్తి చేయని పనులకు సైతం బిల్లులు తీసుకొనే ప్రమాదం ఉందని, వాటిపై రాబోయే ప్రభుత్వం విచారణ చేపడతామని హెచ్చరించారు. మరీ ముఖ్యంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టానికి వ్యతిరేకంగా చెరువుల్లో ఐ ల్యాండ్స్ నిర్మిస్తున్నారని.. ఐ ల్యాండ్ల పేరుతో సైతం కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు అవినీతికి తెరలేపారన్నారు. కుడా, ఇరిగేషన్ అధికారులు వారి వారి బినామీలతో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. భద్రకాళి చెరువు మీద ఆధారపడిన 800 మంది మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారని, మొత్తం రెండు వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్ట పోతున్నారని, వారికి భృతి అందజేయానలి కోరారు. భద్రకాళి బండ్ కట్టినప్పుడు ఎన్జీటీ నిబంధనలను ఉల్లంఘించారని నాడు గగ్గోలు పెట్టిన ఇదే కాంగ్రెస్ నాయకులు నేడు ఐ ల్యాండ్ల పేరుతో చేస్తున్నది ఏంటని ప్రశ్నించారు. ఐ ల్యాండ్ల పేరుతో చెరువు విస్తీర్ణం తగ్గించారని, సుందరీకరణ మొదలు కాలేదని, కనీసం మత్తడి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ప్రజల తరపున కోరుతున్నామన్నారు. ప్రభుత్వం పూడికతీత పనులు ఎంత వరకు జరిగాయో వెంటనే అంచనా వేయాలని, లెక్కలు తేలే వరకు కాంట్రాక్టర్కు బిల్లులు చెల్లించొద్దని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవా లని దాస్యం డిమాండ్ చేశారు. ముఖ్యంగా పూడికతీత జరిగిన ప్రదేశంలో నీరు నిలవడంతో బాలుడు చనిపోవడం బాధాకరమని, బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా నగదు సాయం అందించాలని దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కట్కూరి శ్రీనివాస్



వాయిస్ టుడే ప్రతినిధి, వేములవాడ/ రాజన్న సిరిసిల్ల జిల్లా: వేములవాడ పట్టణ స్థానిక బీఆర్ఎస్ పార్టీ నేత కట్కూరి శ్రీనివాస్, ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ ఆయనను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తనను ఆకట్టుకున్నాయని, ప్రజల కోసం మరింతగా పనిచేసేందుకు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నానని కట్కూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. కట్కూరి శ్రీనివాస్ వెంట దాదాపు 200 మంది కార్యకర్తలు కూడా కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ చేరికలు పట్టణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దుతామని ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, సస్ డైరెక్టర్ నామాల ఉమా లక్ష్మీరాజ్యం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ధైత కుమార్, కృష్ణ, నాగరాజు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, పార్టీ నేతలు నేతలు బింగి మహేష్, గూడూరి మధు, పాత సత్యలక్ష్మి, తోట లహరి, ఫిర్ మహ్మద్, భాశెట్టి రవీందర్, పులి రాంబాబు, పుల్కమ్ రాజు, కూరగాయల కొమురయ్య, ఇప్పపుల అజయ్, మైలారం రాము, ఎర్ర శ్రీనివాస్, ముప్పిడి శ్రీధర్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ చేరిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## కిషన్ దాస్ పేటలో జ్వరంతో వృద్ధురాలు మృతి



వాయిస్ టుడే ప్రతినిధి , ఎల్లారెడ్డిపేట/రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వెలుమల మల్లారెడ్డి భార్య దేవవ్వ (65) గత రెండు రోజులుగా జ్వరం వచ్చి అనారోగ్యానికి గురికాగా స్థానిక హాస్పిటల్ లో చూపించి మందులు వాడుతున్నారు. కాగా శనివారం ఉదయం దమ్ము ఎక్కువగా రావడంతో హాస్పిటల్కు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. డెడ్ బాడీని తమ నివాసానికి తీసుకువచ్చారు. కాగా తన భర్త 8 సంవత్సరాల క్రితం మరణించాడు. మృతురాల్కు ఇద్దరు కొడుకులు ప్రకాష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఉండగా వారిద్దరు పెద్ద కొడుకు కామారెడ్డి జిల్లా సోమరిపేట గ్రామంలో చర్చి పాస్టర్ గా విధులు నిర్వహిస్తుండు. శ్రీనివాస్ రెడ్డి తన అత్తారింటి దగ్గర స్థిరపడ్డాడు. కూతురు లక్ష్మి అల్లుడు తల్లితో ఉంది. మృతురాలు కుటుంబం క్రిస్టియన్స్ కావడంతో వారి ఆచార ప్రకారం అంత్యక్రియలు నిర్వహించేందుకు క్రిస్టియన్స్ మతస్తులు వారి నివాసానికి చేరుకొని అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## సూపర్ పాలనా సంక్షేమమే బిజెపి లక్ష్యం



వాయిస్ కూడా ప్రతినిధి బోయినపల్లి జూన్ 14: భారత ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాలు సేవా సుపరిపాలన సంక్షేమం అనే కార్యక్రమన్ని భారతీయ జనతా పార్టీ బోయిన్పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో , మండల అధ్యక్షులు ఎడపల్లి పరశు రాం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుబ్బాల శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ .. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా దేశ ప్రజల శ్రేయస్సు దృష్ట్యా, మౌలిక సంక్షేమ వసతులు ఏర్పాటు చేస్తూ ప్రపంచంలోనే అగ్రగామిగ, విశ్వ గురువుగా నెలకొల్పడానికి కృషి చేస్తున్నారని తెలిపారు.అదే విధంగా ప్రపంచ యావత్తు భారతదేశం వైపు చూసేలా వైజ్ఞానిక సాంకేతిక వ్యవసాయ అనుబంధ రంగాలలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి ప్రధాని నరేంద్ర మోడీ ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.1947 స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి 2047 సంవత్సరానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని రూపుదిద్దారని తెలిపారు. 2047వ సంవత్సరానికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా విశ్వ గురువుగా నిర్వహించడానికి మనమందరం కృషి చేయాలని ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి ,మాజీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, బిజెపి భూత్ అధ్యక్షులు, బిజెపి సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, శరత్, విజయేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్ సారంపల్లి రాజు, అన్నేమల్ల మోహన్ బాబు ఇల్లందుల బాలయ్య సుంకపాక ప్రభు పసికంటి వెంకటేశం తిరుపతి రంజిత్ రాచర్ల రాజేశం,బుర్ర ప్రదీప్, వంశీ,హనుమంత్ రెడ్డి ప్రశాంత్ , నాగరాజు నరేష్ గంగాధర్ చారి బ్రహ్మప్రసాద్ రామానుజాం మెరుపుల గంగాధర్ శ్రీనివాస్, వెంకటేష్ బూత్ అధ్యక్షులు నాయకులు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాయకులను విడదీస్తూ కార్యకర్తలను రెచ్చగొడుతూ పార్టీ నీ బద్నాం చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు - సుంకరి రమేష్

జమ్మికుంట జూన్ 14 (వాయిస్ టుడే): పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఒక ప్రకటన లో మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్నటువంటి దాడులు ఇల్లందకుంట కావచ్చు అదేవిధంగా నిన్న మొన్న జరిగిన కొత్తపల్లి లో జరిగిన దాడులకు కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధాలు లేదని, వారు వారి వ్యక్తిగత కారణాలవల్ల దాడులు చేసుకుంటున్నారని తెలియజేస్తూ కొంతమంది కావాలని పార్టీని బద్నాం చేస్తూ నాయకున్ని బద్నాం చేస్తూ ఇక్కడ గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయని అపోహాలు వెల్లబుచ్చుతున్నారు అని ఈ నియోజకవర్గంలో ఒకే నాయకుడు ఒకే జెండా ఆయనే ఒడితల ప్రణవ్ బాబు అని, ఇక్కడ గతంలో పోటీ చేసినటువంటి నాయకులు బల్మూరి వెంకట్ పేరు చెప్పి బద్నాం చేస్తున్నారు ఆయన ప్రభుత్వంలో మంచి ఉన్నతమైన పదవి ఎమ్మెల్సీగా ఉన్నారు వారిని కావాలని ఈ ప్రాంతం నుంచి కొంతమంది బద్నాం చేస్తూ పబ్బం గడుపుతున్నారని చెప్పక తప్పదు అని అదేవిధంగా ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుండి కార్యకర్తల వెంట ఉండి పార్టీని నడుపుతూ పార్టీ కార్యక్రమాలు చేస్తున్నటువంటి పత్తి కృష్ణారెడ్డి మీద కూడా కొంతమంది కావాలని తప్పుడు ఆరోపణలు చేస్తూ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నటువంటి కాంగ్రెస్ పార్టీ వ్యక్తులను పార్టీ నాయకత్వం కచ్చితంగా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని తెలియజేసారూ.

# సిరిసిల్ల వేములవాడ పట్టణ, ఆలయ అభివృద్ధికి కృషి..

### రాజకీయాలకు అతీతంగా వేములవాడ పట్టణ, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాము: ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్



వాయిస్ టుడే ప్రతినిధి, వేములవాడ/ రాజన్న సిరిసిల్ల జిల్లా: వేములవాడ పట్టణంలో 5,6,9,10 వార్డుల్లో పలు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్,పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని,గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం హయంలో పడవు పడ్డా పనులను పూర్తి చేస్తున్నామని అన్నారు.ఇప్పటికే పట్టణంలో పలు సామాజిక భవనల కు నిధులు ఇవ్వడం జరిగిందని, నాంపల్లిలో మహిళా సంఘ భవనానికి, కమ్యూనిటీ భవన నిర్మాణ కోసం నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు చెప్పేది వింటూ ముందుకు పోతున్నామని,ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం పది సంత్సరాలలో మంజూరు చేయని నూతన రేషన్ కార్డులు ప్రజా ప్రభుత్వంలో మంజూరు చేయడం జరిగిందని,పేద ధనిక తేడా లేకుండా రేషన్ కార్డు ఉన్నా వారికి సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు.

భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం ఇవ్వడం జరుగుతుందని అన్నారు.వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు కోసం 47 కొట్లు మంజూరు చేయడం జరిగిందని,శుక్రవారం 40 మందికి నష్ట పరిహారం అందించడం జరిగిందని అన్నారు. త్వరలోనే రోడ్డు వెడల్పు,ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని, రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి మీ ఆశీర్వాదాలు అందజేయాలని అన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు రని వారు ఎలాంటి ఆందోళనలు చెద్దవద్దని, మరో విడుతలో తప్పకుండా ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మాజీ కౌన్సిలర్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకున్న కేసులకు శాశ్వత పరిష్కారం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జి. రాజగోపాల్

### లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి



ఖమ్మం , జూన్ -14 ( వాయిస్ టుడే) : లోక్ అదాలత్ లో కేసును ఇరుపక్షాలు రాజీ చేసుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అంతిమ తీర్పుపై ఎటువంటి అప్పీల్ కు అవకాశం వుండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ తెలిపారు.

శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. చంద్రశేఖర్ రావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో అదనపు జిల్లా సెషన్స్ జడ్జ్ కె. ఉమా దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర్ రావు లతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. రాజగోపాల్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సివిల్, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవాలని, ఎటువంటి రుసుము, సమయం వెచ్చించాల్సిన అవసరం లేదని తెలిపారు.

లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులు సత్వర పరిష్కారమే కాకుండా ప్రీ లిటిగేషన్ (భార్య భర్తల కేసులు, డబ్బు సంబంధించిన కేసులు, సివిల్ తగాదాలు) కూడా పరిష్కారం అవుతాయని అన్నారు. చెక్ బౌన్స్ కేసులు చర్చల ద్వారా లోక్ అదాలత్ లో పరిష్కారం చేసుకోవచ్చని అన్నారు.

మోటార్ వాహన ప్రమాద కేసులు, అక్క చెల్లెల్లు, అన్నదమ్ముల కేసులు, భార్య భర్తల మధ్య వివాద కేసులను లోక్ అదాలత్ ద్వారా సెటిల్మెంట్ చేసుకోవాలని అన్నారు.

న్యాయ సేవా సంస్థ కోర్టు దగ్గర రెగ్యులర్ గా అందుబాటులో ఉంటుందని, మన దగ్గర స్పెషల్ మీడియేషన్ సెంటర్, శిక్షణ పొందిన మీడియేటర్స్ కూడా ఉన్నారని, వారి సహకారంతో కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు.

లోక్ అదాలత్ ద్వారా ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 3 వేల 500 సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసామని తెలిపారు. 62 మోటార్ వెహికల్ ప్రమాద కేసులలో రాజీ ద్వారా 2 కోట్ల 80 లక్షల పరిహారం ఇప్పించడం జరిగిందని అన్నారు. లోక్ అదాలత్ లో కక్షిదారులు, భీమా కంపెనీలు కూర్చొని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు.

న్యాయవాదులు వ్యవస్థలో ఒక భాగమని, వారి సహకారంతో కక్షిదారులకు మంచి తీర్పు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ను కక్షిదారులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడే పవిత్ర బాధ్యత న్యాయవాదులకు ఉంటుందని అన్నారు. న్యాయవాద సేవలను ప్రతి ఒక్కరు గుర్తించాలని అన్నారు. లోక్ ఆదాలత్ ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, అనవసరంగా ప్రైవేట్ సెటిల్మెంట్స్ చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన వృద్ధ మహిళ గొర్ల రత్తమ్మ తరపున న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ కేసు దాఖలు చేయగా సత్వర పరిష్కారం చేసి హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు ద్వారా 11 లక్షల 50 వేల రూపాయలకు అవార్డ్ అందజేశారు. భవాని, వీరభద్రం భార్య భర్తల వివాదానికి సంబంధించిన కేసు రాజీ ద్వారా పరిష్కరించడం జరిగింది.

అనంతరం పాత్రికేయులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కోర్టు పరిధి లోనే కాకుండా సత్తుపల్లి, మధిర కోర్టులలో కూడా జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ సూచనలు, సలహా మేరకు జాతీయ లోక్ అదాలత్ జరుపుకుంటున్నామని అన్నారు. సివిల్ కేసుల పరిష్కారానికి వీటిని వినియోగించుకోవచ్చని అన్నారు. మనకు సమయం ఆదా అవుతుందని అన్నారు. రాజీ చేసుకోవాల్సిన క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులకు కూడా సెటిల్ చేయడం జరుగుతుందని అన్నారు.

లోక్ అదాలత్ వల్ల ప్రజలలో మంచి వాతావరణం ఏర్పడుతుందని, వివాదాలు తగ్గిపోతాయని అన్నారు. ప్రశాంత వాతావరణం ఉంటే అభివృద్ధి వేగవంతం అవుతుందని, రాజీ మార్గమే రాజ మార్గమని అన్నారు.

ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కర్రి ఉమాదేవి, దేవినేని రామప్రసాదరావు, వి. శీనయ్య, యం.అర్చన కుమారి, యం. కల్పన, టి.మురళి మోహన్, కే.వి. చంద్ర శేఖర్ రావు, కాసరగడ్డ దీప, బెక్కమ్ రజని, ఏపూరి బిందు ప్రియ, వి.మాధవి, బి. నాగ లక్ష్మి, బార్ అసోసియేషన్ గద్దల దిలిప్ కుమార్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెని న్యాయవాదులు బండారుపల్లి గంగాధర్, పి. సంధ్య రాణి, కొత్తపల్లి రామారావు, స్వర్ణ రాంబాబు, మందడపు శీనివాసరావు, న్యాయ శాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆపద సమయంలో రక్తదానం

రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ మండలం రామజీ పేట గ్రామానికి చెందిన సింగిడి లక్ష్మి ప్రమాదవశాత్తు ఇంట్లో జారీ పడగా గాయాలు కావడంతో జగిత్యాలలో ఓ హాస్పిటల్ లో చేరిపించగా శాస్త్ర చికిత్స నిమిత్తం పాజిటివ్ రక్తం కావాలని వైద్యులు సూచించడంతో సామాజిక మాధ్యమల ద్వారా ప్రచారం చేయడంతో రాయికల్ మండలం ధర్మాజిపేట్ కు చెందిన మారంపెల్లి హరీష్.. రాజానగరం గ్రామానికి చెందిన భారతపు రాజు లు మానవత్వంతో స్పందించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారిని రాయికల్ మండల జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు సింగడి శంకర్ అభినందించారు

## నీట్‌లో యన్మన్ గండ్ల విద్యార్థి ఆణిముత్యం

### మారుమూల గ్రామం నుండి వైద్య విద్యకు ఎంపికైన జుర్కి సాత్విక



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా జున్.14 (జడ్చర్ల): నవాబుపేట్‌బీదేశ వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే అతిక్లిష్ట తరమైన నీట్ యూజీ 2025 పరీక్షా ఫలితాల్లో మండల పరిధిలోని యన్మన్ గండ్ల / రుక్కంపల్లి గ్రామానికి చెందిన జుర్కి సాత్విక(మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు,సీనియర్ జర్నలిస్ట్,నమస్తే తెలంగాణ రిపోర్టర్ వెంకట్ రాములు కూతురు)సత్తా చాటారు.శనివారం విడుదలైన"నీట్ యూజీ 2025"పరీక్ష ఫలితాలలో 425మార్కులతో ఆల్ ఇండియా లెవెల్ 163806 ర్యాంకు సాధించింది తన సత్తా చాటింది.కాగా అతి కఠినమైన ఫిజిక్స్ సబ్జెక్ లో 95.598మార్కులు సాధించడం విశేషం.జుర్కి సాత్విక విజయం పట్ల మండల వ్యాప్తంగా పలువురు ప్రముఖులు,నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## సింగరేణి డైరెక్టర్ పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ (పా) గా గౌతమ్ పొట్రు



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూన్ 14: సింగరేణి సంస్థ లో డైరెక్టర్ పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ (పా) గా నియమితులైన గౌతమ్ పొట్రు శనివారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరామ్ సమక్షంలో బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతలను డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు అదనపు బాధ్యతగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్. బలరామ్ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ పొట్రుకు తన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సంస్థ డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్. డి. ఎం. సుభాని జీఎం మార్కెటింగ్ ఎన్.వి. రాజశేఖర్ రావు తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

## లోక్ అదాలత్ లతో సమ న్యాయం

### జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా జూన్-14 వాయిస్ టుడే: రాజీ మార్గమే రాజ మార్గం అని, లోక్ అదాలత్ లతో ఇరువర్గాలకు సమన్యాయం అందుతుందని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ ను పురస్కరించుకుని మండల న్యాయసేవాదికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మున్సిఫ్ కోర్టు అవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ లోక్ అదాలత్ లో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని, రాజీ మార్గంతో కేసులు పరిష్కరించుకోవచ్చనీ, తద్వారా ఇరువర్గాలకు సమ న్యాయం అందుతుందని అన్నారు. క్షణికావేశంలో చేసిన నేరాల వల్ల భవిష్యత్తు కోల్పోతారని, వ్యయ్య ప్రయాసలకు గురికాకుండా ఉండేందుకు లోక్ అదాలత్ లలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ లో పలు క్రిమినల్, చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలు, సివిల్ కేసులకు సంబంధించిన నాలుగు వందల అరవై ఏడు కేసులు పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి భోయిని భూమయ్య, ఏజీపి దూడం ఆంజనేయులు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ సభ్యులు మాడూరి ఆంజనేయులు, చీకటి సంతోష్ కుమార్, న్యాయవాదులు పబ్బతి లక్ష్మీకాంత రెడ్డి, ఆవుల లక్ష్మి రాజం, వొడ్నాల రవీందర్, ఆవునూరి సత్యనారాయణ, జోగుల రమేష్ లతో పాటు పలువురు న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు..

# రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలి

## రక్తదాన దినోత్సవ శిబిరంలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



నిజామాబాద్ రూరల్ జూన్ 14 : ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సూచించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుంపల్లి మహేందర్ , ఉమ్మాజీ నరేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరానికి అనుహ్య స్పందన ఏర్పడింది. ఈ రక్తదాన శిబిరాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిండు ప్రాణాలను రక్షించడం లాంటిదేనని ఇ లాంటి గొప్ప కార్యక్రమాన్ని నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తుంపల్లి మహేందర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. కేవలం స్వార్థ ప్రయోజనాలు రాజకీయ ప్రయోజనాలు కోసమే కాకుండా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ఎంతో గొప్ప విషయం అన్నారు. కార్యక్రమాన్ని చూస్తుంటే రూరల్ కాంగ్రెస్ యువజన నాయకులు పార్టీ కోసమే కాకుండా మానవత్వంతో ఆలోచించి రక్తదానం చేయడానికి ముందుకు రావడం సంతోషకరమని ఆయన వారి సేవలను ప్రశంసించారు. వారికి ఎప్పుడూ ఆ భగవంతుడి కృప, ఆశీస్సులు ఉంటాయని ఆయన అన్నారు. అదేవిధంగా పార్టీ కోసం రూరల్ నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతూనే ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని తాను స్వాగతిస్తున్నట్లు భూపతి రెడ్డి వెల్లడించారు.. అంతర్జాతీయ రక్త దినోత్సవ సందర్భంగా 30 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం ఇవ్వడం అభినందనీయమన్నారు. పార్టీని విస్తృతంగా బలపరుస్తూనే యువజన కాంగ్రెస్ నాయకులు ఇలాంటి మానవతా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే నిజామాబాద్ రూరల్ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంపల్లి మహేందర్, ఉమ్మజీ నరేష్ లు సంయుక్తంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని రక్తదానం చేసి ఆదుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. చాలామంది యువత వివిధ ప్రమాదాల్లో పడినప్పుడు రక్తస్రావం ఎక్కువగా అవుతుందని, అటువంటివారు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు రక్తదానం చేయడం వల్ల ఒక మనిషిని బ్రతికించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, పార్టీ కార్యకర్తలకు యువజన నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఆకాశ్ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ వినోద్ , బైండ్ల ప్రశాంత్,వంశీ, వెంకటేష్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.



## క్షయ వ్యాధిపై అవగాహన

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూన్ 14 : బోయినపల్లి మండలంలోని తండగొండ గ్రామం లో క్షయ వ్యాధి పై అవగాహనను టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్య అధికారి డాక్టర్ ఆర్. కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ.. షుగర్, క్యాన్సర్, బీపీ, దీర్ఘకాళికా వ్యాధులు, పొగ తీసుకునే వారిలో క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నాయని, క్షయ లక్షణాలు రెండు వారలకు మించి దగ్గు జ్వరం, ఆకలి లేకపోవడం, రాత్రిపూట చెమటలు పట్టడం,బరువు తగ్గడం వున్నవారు. తేమడ పరీక్షలు చేయించుకోవాల్సిందిగా సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించిన కార్యక్రమంలో 84 మంది కి పైగా టీబీ స్క్రీనింగ్ చేశామని 22 మంది అనుమానితుల నుండి తేమడ నమూనాలను సేకరించి ల్యాబ్ కు పంపించమన్నారు. 7 మంది సింటామెటిక్ వాళ్ళని ఎక్సరే వేములవాడ ఏరియా హాస్పిటల్ కు పంపించామని అందులో క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికీ 6 నెలల పాటు పూర్తి ఉచితంగా పరీక్షలు, మందులు ఇస్తామన్నారు. అలాగే నిక్షయ్ పోషన్ ద్వారా వ్యాధిగ్రస్థులకు నెలకి 1000/- రూపాయలు పావష్టికహారం కోసం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, సూపర్‌వైజర్లు, శశికుమార్, హేమలత, ఎస్ టి ఎస్ గంగాధర్, ఎంపీహెచ్ఏ లింగం కుమార్, అశోక్, ఏఎన్ఎంలు వసంత, ఉష, శ్యామల, ఆశలు సునీత, అనసూర్య, లత, సిహెచ్ బాబు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టి




ఖమ్మం , జూన్ -13 ( వాయిస్ టుడే ): ఖమ్మం జిల్లా కలెక్టర్ గా అనుదీప్ దురిశెట్టి బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న అనుదీప్ దురిశెట్టి ఖమ్మం జిల్లా కలెక్టర్ గా బదిలీ అయిన సందర్భంగా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్లో జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనుదీప్ దురిశెట్టి ని అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, డిఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, తహసిల్దార్ లు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ ల పర్యవేక్షకులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.



## అమరవీరుల ఆశయాలు సాధించాలి!

మేదరమెట్ల, కోదాడ, జూన్ 14: (వాయిస్ టుడే ప్రతినిధి). సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణ సాగర్పు రామారావు అకాల మృతి సిపిఎం పార్టీకి , కుటుంబానికి తీరనిలోటని సిపిఎం సీనియర్ నాయకులు మేదరమట్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జుట్టు కొండ బసవయ్య,ఎం ముత్యాలు ,ప్రజా సంఘాల నాయకులు ఏనుగుల వీరాంజనేయులు , కోదాడ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కాసర్ల కోటేశ్వరరావు, అల్వాల రామారావు ,పొన్నం ఏసయ్య, మారిశెట్టి నరసింహారావు, గుండపునేని నరసింహారావు, కృష్ణ సాగర్ వాసు, వీరబాబు జంగపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి డాక్టర్ సి .లక్ష్మారెడ్డికి అవార్డు అందజేత

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా జూన్ 14 (జడ్చర్ల): హైదరాబాద్ లో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి డా. సి.లక్ష్మారెడ్డి కి అత్యధిక స్థాయిలో రక్తదాతలకు ప్రేరణగా జడ్చర్ల మాజీ మంత్రి మరియు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వ్యక్తిగత అత్యధిక బ్లడ్ డొనేట్ చేసినందుకు అవార్డు ప్రకటించడం జరిగినది.ఈ అవార్డును డాక్టర్ లక్ష్మారెడ్డి తరుపున రాజ్ భవన్ లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా జడ్చర్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోడ్గల్ యాదయ్య ,ప్రణీల్ చందర్ ,నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా జూన్-14వాయిస్ టుడే: సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా లయన్ డాక్టర్ జూపల్లి తిరుమల్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లయన్స్ క్లబ్ ఇరవై నాలుగవ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్స్టాలేషన్ ఆఫీసర్ గా పూర్వ జిల్లా గవర్నర్ లయన్ రేకులపల్లి విజయ వ్యవహరించి, అధ్యక్షులుగా డాక్టర్ జూపల్లి తిరుమలరావు, ప్రధాన కార్యదర్శిగా ఎరబెల్లి సుధీర్ రావు, కోశాధికారిగా తమ్మనవేని సతీష్, ఉపాధ్యక్షులుగా పూసాల సాంబమూర్తి ఇతర కార్యవర్గ సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మూడు వందల ఇరవై, జి, జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు చేశారని, ఎంతోమంది పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం, చూపు లేని వారికోసం ఉచిత కంటి చికిత్స శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమంది అందులకు ఉచితంగా ఆపరేషన్ చేయించారని కొనియాడారు. అలాగే నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మరిన్ని ఉత్తమ సేవా కార్యక్రమాలు చేసి క్లబ్ ను ఉన్నతంగా నిలపాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు జూపల్లి తిరుమలరావు మాట్లాడుతూ, నాపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ, నాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ, సభ్యులందరి సమన్వయంతో రానున్న కాలంలో సుల్తానాబాద్ క్లబ్బును జిల్లాలో ఉత్తమ క్లబ్బుగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా గవర్నర్ లయన్ నడిపెల్లి వెంకటేశ్వరరావు, పూర్వ జిల్లా గవర్నర్ రేకులపల్లి విజయ, జి.ఎం.టి డీ బంక రామస్వామి, జి.ఈ.టి డి మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, రీజియన్ చైర్మన్ రేకులపల్లి శశాంక, జోన్ చైర్మన్, డి మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్లు వలస నీలయ్య, మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, పూర్వ అధ్యక్షులు గజబీంకర్ జగన్, ధీకొండ భూమేష్, గుడిమల్ల కనకయ్య, సభ్యులు పిట్టల వెంకటేశం, రాయల్ల నవీన్, కట్ల సంపత్, ఆడెపు పాండు, పూసాల రామకృష్ణ, కోడూరి వెంకటేశం, పల్ల అనిల్ కుమార్, నాగమల్ల ప్రశాంత్, పల్ల శరత్, చకిలం వెంకటేశ్వర్లు, ఏనుగు నరేందర్ రెడ్డి, ఆడెపు సదానందం, దావల్ల నరేందర్, తాటిపల్లి రాజు, దాసరి ప్రసాద్, నోముల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు..

## వాహన నిబంధనలు పాటించకపోతే చర్యలు

### విద్యాసంస్థల యాజమాన్యాలు జాగ్రత్తలు పాటించాలి

### డ్రైవర్స్ క్రమశిక్షణతో వాహనాలు నడపాలి

### జిల్లా ఎస్పి కె.నరసింహ



సూర్యాపేట, జూన్ 14(వాయిస్ టుడే ప్రతినిధి) : విద్యాసంస్థలు, పాఠశాలల వాహనదారులు నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ నరసింహ శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. పాఠశాలలకు విద్యార్థులను రవాణా చేసే వాహనాలు మంచి కండిషన్ లో ఉండాలని, వాహనాల నిర్వహణలో నియమనిబంధనలు పాటించాలన్నారు.వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని, లోపాలు సవరించుకోవాలని సూచించారు. ఐపీఎస్ విద్యాసంస్థల యాజమాన్యాలను, వాహనాల యజమానులను ఆదేశించారు. వాహనాలు నడిపే డ్రైవర్లు మంచి నైపుణ్యం కలిగి క్రమశిక్షణతో వాహనాలు నడపాలన్నారు. అన్నారు. అతివేగంగా వాహనాలు నడపవద్దని, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దన్నారు. విద్యార్థులను తీసుకొచ్చే క్రమంలో అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టపరంగా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## నేడు బ్రాహ్మణ కళ్యాణమండపంలో యోగ పై అవగాహన సమావేశం

సూర్యాపేట ,జూన్14 (వాయిస్ టుడే న్యూస్): ఈనెల 21న అంతర్జాతీయ యోగా డే సందర్భంగా యోగ డే సందర్భంగా నేడు పట్టణం లోని బ్రాహ్మణ కళ్యాణ మండపంలో యోగ సంబరాలు, అవగాహన సదస్సునిర్వహిస్తున్నట్లు సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం యోగా గురువు చాడపాపిరెడ్డి తెలిపారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రంలో సాధకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఐక్యరాజ్యసమితిని ఒప్పించి అంతర్జాతీయ యోగ డే ప్రకటించి నేటికీ 10 సంవత్సరములు పూర్తయి 11వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు వన్ ఎర్త్ .. వన్ హెల్త్ స్లోగన్ తో యోగ డే సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నేడు బ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఉదయం ఐదు గంటల నుండి 8 గంటల వరకు జరిగే యోగా వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఎపి జల దోపిడికి బిజెపి పూర్తి మద్దతు: హరీష్ రావు

హైదరాబాద్ జూన్ 14: ఆంధ్రప్రదేశ్ జల దోపిడికి పాల్పడుతోందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఎపి నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ బిజెపి నేతలు ఏం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్ లో బనకచర్ల ప్రాజెక్టుపై హరీష్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బిజెపి పార్టీలు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎపి జల దోపిడికి బిజెపికి పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. న్యాయబద్ధంగా రెండు రాష్ట్రాలకు కేంద్రం నీళ్లు పంచాలని.. కానీ ఎపికి బిజెపి మద్దతు తెలుపుతుందని చెప్పారు.పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే నియంత్రించాల్సిన కేంద్రం.. నిధులిస్తూ తెలంగాణకు ద్రోహం చేస్తుందని హరీష్ రావు మండిపడ్డారు.

# రైతు నేస్తం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూన్ 14: ఈ నెల 16 సోమవారం జరుగు రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడుతారని, ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. సోమవారం నిర్వహించి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడునున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 58 రైతువేదికలలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సోమవారం అన్ని రైతు వేదికలను పండుగ వాతావరణం లో మామిడి తోరణాలు, రంగవల్లులతో అలంకరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకే రైతు వేదిక వద్దకు రైతులు చేరుకునేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఆడియో వీడియోలో ఎటువంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా సరిచూసుకోవాలని ఏవైనా సమస్యలు ఉంటే రేపటిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు వేదికలకు విచ్చేసే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మహిళా రైతులు కూడా పెద్ద ఎత్తున హాజరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలను పలకాలని అధికారులకు సూచించారు. ప్రతి రైతు వేదికలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మండల స్థాయిలో ఎంత మంది రైతులకు ఎంత మొత్తంలో రైతు భరోసా జమ అవుతున్నదో వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు. రైతు వేదికలకు పెద్ద ఎత్తున రైతులు హాజరవుతారు కాబట్టి, రైతు వేదికల వెలుపల ఏబిసిడి డ్రైవ్ పై అవగాహన కల్పించే విధంగా స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమానికి రైతు వేదిక పరిధిలో మునగ సాగు చేపట్టి లబ్ధి చేకూరిన రైతులను ఆహ్వానించి వారి ద్వారా ఇతర రైతులకు మునగ సాగు ద్వారా వచ్చే లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. రైతు నేస్తం కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీఎంలు కూడా హాజరు కావాలని, దాని ద్వారా వారు మహిళా సమైక్య సభ్యులకు అజోల్ల పెంపకం, బయోచార్ తయారీ, చేపల పెంపకం తదితర వాటిపై సభ్యులకు అవగాహన కల్పించడం ద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని కలెక్టర్ సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో దేశం మొత్తం జిల్లా వైపు చూస్తుందని దీనికి సహకరించిన ప్రతి అధికారి, ఉద్యోగస్తులను కలెక్టర్ అభినందించారు. రానున్న వర్షాకాలంలో ఎక్కడైతే వర్షం నీరు నిలుస్తుందో అక్కడ వెంటనే ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.

## గంటలో దర్శనానికి ప్లాన్



తిరుమల, జూన్ 14, (వాయిస్ టుడే) : తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. ప్రతి ఏడాది స్వామి వారిని దర్శించుకునే వారు ఉంటారు. రోజుకు గరిష్టంగా లక్షలాదిమంది.. కనిష్టంగా వేలాది మంది భక్తులు తిరుమల వస్తుంటారు. వారికి దర్శనాలు కల్పించడంతోపాటు నియంత్రించడం టిటిడి కి కష్ట సాధ్యం అవుతుంది. పటిష్టమైన చర్యలు చేపడుతున్న ఎక్కడో చోట లోపాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని సందర్భాల్లో క్యూ లైన్లోకి మించి బయటకు భక్తులు వస్తుంటారు. కొన్ని సందర్భాల్లో అయితే గంటలపాటు కాంప్లెక్స్ లలో భక్తులు వేచి ఉండాల్సి ఉంటుంది. ఇటువంటి తరుణంలో వినూత్న ఆలోచన చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. భక్తులు క్యూ లైన్ లలో ఉండగానే స్వామి వారి దర్శన భాగ్యం కల్పించేందుకు నిర్ణయించింది.సాధారణంగా తిరుమల వెళ్లే భక్తులకు స్వామివారి దర్శనానికి కొన్నిసార్లు 12 గంటల సమయం పడుతుంది. ఆ సమయంలో భక్తుల బాధలు వర్ణనాతీతం. టీటీడీ( పరంగా మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు అందిస్తోంది. కానీ క్యూలైన్లలో భక్తులు ఉన్నప్పుడు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అటువంటి సమయంలో స్వామివారి దర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇటీవల చైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కీలక నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావు కార్యాచరణను వేగవంతం చేశారు. ముఖ్యంగా భక్తులు వేచి ఉండే కంపార్ట్మెంట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారుఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కెమెరాలు ద్వారా తిరుమల వచ్చే భక్తుల రద్దీ ని అంచనా వేయనున్నారు టీటీడీ అధికారులు. తద్వారా భక్తులకు దర్శన సమయాన్ని నిర్దిష్టంగా ఇవ్వనున్నారు. ప్రస్తుతం గంటకు ఎంతమంది శ్రీవారిని దర్శించుకుంటున్నారనే సమాచారం టిటిడి వద్ద లేదు. ఆ వివరాలు అందుబాటులోకి వస్తే దళారులు, కొందరు ఉద్యోగుల సహకారంతో ఇష్టారాజ్యంగా క్యూ లైన్లోకి వచ్చే సంస్కృతికి బ్రేక్ పడుతుంది. జియో సంస్థ ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫేషియల్ రికగ్నిషన్ ను ఉపయోగించి భక్తుల మొక్క చిత్రాలు నమోదు చేస్తుంది. తద్వారా గంటల వ్యవధిలోనే తిరుమల శ్రీవారి దర్శనం పూర్తి చేసుకునే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇదే విషయాన్ని తాజాగా వెల్లడించారు టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు.



## మంత్రి వివేక్ వెంకటస్వామికి ఘన స్వాగతం

చెన్నూరు: మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామికి గజ్వేల్, సిద్దిపేట, కరీంనగర్, సుల్తానాబాద్, పెద్దకాల్వల, పెద్దపల్లి, గోదావరిఖని, ఇందారం, రసూలుపల్లి, జైపూర్, వద్ద కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాల్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు. డీజే సప్పుళ్లు, బ్యాండ్ బాజా, డ్యాన్సు లతో భారీ గజమాలతో సత్కరించారు. వివేక్ మాట్లాడుతూ జైపూర్ మండల నాయకులు ఇంత ఘన స్వాగతం పలికినందుకు చాలా సంతోషం. ఎక్కడ కూడా అవినీతి లేకుండా అభివృద్ధి చేసానని గెలిపించారు. నేను ఎక్కడ కూడా అవకతవకలు లేకుండా, అక్రమాలు లేకుండా అభివృధి చేస్తాను. ఇసుక దందా బంద్ చేయాలని ఏదైతే మీరు కోరారు నేను బంద్ చూపించడం జరిగింది. అందుకే ఇక్కడ నాకు మైనింగ్ మంత్రిగా ఇవ్వడం జరిగింది. రేవంత్ రెడ్డి అక్రమ ఇసుక రవాణా జరగకుండా చూడాలని అన్నారు. ఇసుక రాయల్ ట్యాక్స్ తో అధిక నిధులతో అభివృద్ధి చేస్తాను. ప్రజా పాలనలో ఎక్కడ కూడా అన్యాయంగా అరెస్ట్ చేయడం లేదు గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేశారు. నేను ప్రతీ గ్రామానికి 50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఫ్రీ బస్, 500 లకే గ్యాస్ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుంది. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇస్తా అని మోసం చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నానని అన్నారు. ప్రభుత్వం మనకు సన్న బియ్యం కూడా ఇవ్వడం జరుగుతుంది. నేను విద్య పైన దృష్టి పెట్టి సోమనపల్లి గ్రామంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి పనులు జరుగుతున్నాయి. నేను ఎప్పుడూ మీతోనే ఉంటాను మీకోసమే పని చేస్తానని హామీ ఇస్తున్నానని అన్నారు.

# వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరూ పాల్గొని "ప్రతీ అడుగు పచ్చదనం" చేయాలి

### 45 లక్షల మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలి

### "నీటి బిందువు జలసింధువు" కార్యక్రమంలో 60 చెరువుల నిర్మాణం పూర్తి

### చిన్న తరహా పరిశ్రమల సౌకర్యం కోసం హైదరాబాద్‌కు సమీపంలో బొగ్గు విక్రయ కేంద్రం ఏర్పాటుకు యోచన

### అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ల సమావేశంలో సింగరేణి సీ ఎం డీ ఎన్. బలరామ్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూన్ 14: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ "ప్రతీ అడుగు పచ్చదనం" నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతుందని, దీనిలో అధికారులు, ఉద్యోగులు, స్థానికులు అందరూ పాల్గొనేలా ప్రత్యేక చొరవ చూపాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ ఆదేశించారు. శనివారం ఉదయం ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల్లోని జనరల్ మేనేజర్లతో వివిధ అంశాల పైన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ ఏడాది వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 675 హెక్టార్లలో 45 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దీనిని విజయవంతం చేయడం కోసం ప్రతీ ఒక్కరూ తమకు సాధ్యమైనన్ని మొక్కలు నాటే విధంగా చొరవ చూపాలని కోరారు.

"నీటి బిందువు జలసింధువు" కార్యక్రమంలో భాగంగా మొత్తం 62 మినీ చెరువుల నిర్మాణంలో ఇప్పటికే 60 చెరువులు పూర్తవడం సంతోషకరమని, మిగిలిన చెరువులు కూడా మరో వారం లోపు పూర్తి చేయాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా సమీప గ్రామాల్లో 43 చెరువుల్లో మట్టి పూడికలు తీయాలని నిర్ణయించామని, వీటిలో ఇప్పటికి కేవలం నాలుగు మాత్రమే పూర్తయ్యాయి. కనుక మిగిలినవి త్వరగా పూర్తి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించడం కోసం ఇకపై సింగరేణి సంస్థ నుండి జి 14, జి 15 గ్రేడు గల బొగ్గు రవాణాను పూర్తిగా నిలిపివేయాలని, దానికి బదులు జి 13 గ్రేడ్ బొగ్గును సరఫరా చేయటానికి తగు ఏర్పాటు చేయాలని జనరల్ మేనేజర్లను ఆదేశించారు. చిన్న తరహా పరిశ్రమల వారు తమకు కావలసిన తక్కువ మోతాదు బొగ్గును సింగరేణి ఏరియాలకు వచ్చి తీసుకువెళ్లడం అంత వెసులుబాటు కావడం లేదని గమనించబడిందని, వీరి సౌకర్యం కోసం హైదరాబాదుకు సమీపంలో ఒక బొగ్గు విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులని ఆదేశించారు.

భూపాలపల్లి ఏరియాలోని భూగర్భ గనులలో సాండ్ స్టోయింగ్ కోసం గోదావరి నది నుండి ఇసుక సేకరణకు గాను వెంటనే క్వారీ ఏర్పాటుకు అనుమతులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఈ అండ్ ఎం డి. సత్యనారాయణ రావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ కె. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం సుభాని, జనరల్ మేనేజర్ సి పి పి ఏ. మనోహర్, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్.వి. రాజశేఖర్ రావు, కార్పోరేట్ నుండి వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, ఏరియాల్లోని జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.